بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

సంపుటి: 10

సంచిక : 49

వార్షిక చందా 600/-రూ॥

www.akhbarbadr.in

04 డిసంబర్ 2025 క్రీ, శ. 04 ఫతహ్ ఇఖా 1404 హి, శ.

12 జమాదిఉస్సాని 1447 హి,ఖ.

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్యవంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను నమకూర్చుగాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ
وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ۔

## ఖుర్ఆన్ బోధనలు

فَاجۡتَنِبُوا الرِّجۡسَ
مِنَ الۡاَوۡثَانِ وَاجۡتَنِبُوۡا
قَوۡلَ الزُّوۡرِ ۝
﴿سُوۡرَۃُ الۡحَجِّ:31﴾

**అనువాదం:** అపవిత్రమైన విగ్రహముల నుండి దూరముండుడు. అబద్ధములాడకుము.

(హజ్:31)

## నేను మీకు కల్పించే నమ్మకం ఏమిటనగా, చివరికి సత్యమే గెలుస్తుంది. అబద్ధంను మించిన కీడు మరొక్కటి లేదని నేను మీకు నిశ్చచముగా గుర్తుచేస్తున్నాను.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశాలు:

పవిత్ర ఖుర్ఆన్ అబద్ధమును ఒక అపవిత్రముగా, ఒక మలినముగా పేర్కొన్నది. ఈ విషయాన్నే **ఫజ్‌తనిబూ ర్రిజ్‌స మినల్ అవ్‌సాని వజ్‌తనిబూ ఖౌల జ్జూర్** అని పేర్కొన్నది. చూడండి ఇక్కడ అబద్ధమును విగ్రహానికి ప్రతీకగా పేర్కొన్నది. వాస్తవానికి అబద్ధము కూడ ఒక విగ్రహమే. లేనిచో ఎందుకు సత్యాన్ని వదిలి మరోక మార్గమును ఎంచుకుంటారు. ఏ విధముగానైతే విగ్రహాల వెనక ఎలాంటి వాస్తవికత ఉండదో, అదే విధముగా అబద్ధము వెనకాల కూడ కుతంత్రం తప్ప మరేమి ఉండదు. అబద్ధము ఆడేవారి పట్ల, ఒకవేళ వారు ఎప్పుడైన నిజం మాట్లాడిన కూడ అతడు చెప్పింది అబద్ధమై ఉండవచ్చుననే ఆలోచన కల్గున్నతగా నమ్మకం పోతుంది. ఒకవేళ అబద్ధము ఆడేవారు తమ అబద్ధపు తత్వాన్ని వీడాలను కున్నచో అది వెంటనే దూరమైపోదు. అందుకు చాలా కాలం వరకు అబ్యాసం చేయవలసి ఉంటుంది. అప్పుడు అబద్ధము ఆడే అలవాటు దూరమైపోతుంది. **(అల్ హకమ్, సంపుటి 6, సంఖ్య 31, తేది 31-ఆగష్టు 1902, పేజి 2)**

నేను మీకు కల్పించే నమ్మకం ఏమిటనగా, చివరికి సత్యమే గెలుస్తుంది. విజయం, వికాసం సత్యం ద్వారనే లభిస్తాయి. ... అబద్ధంను మించిన కీడు మరొక్కటి లేదని నేను మీకు నిశ్చచముగా గుర్తుచేస్తున్నాను. సాధారణముగా ప్రపంచీకులు సత్యం పలికినచో పట్టుబడుతారు అని అంటారు. కాని నేను ఈ విషయాన్ని ఎందుకు నమ్మాలి. నాపై 7 వ్యాజ్యాలను మోపారు. అల్లాహ్ తాలా దయవలన ఏ ఒక్క వ్యాజ్యములో కూడ ఏ ఒక్క పదం అబద్ధము వ్రాయవలసిన అవసరమే రాలేదు. ఏ ఒక్క దానిలోనైన అల్లాహ్ నాకు ఓటమిని కల్గించాడా! ఏ ఒక్కరైన చెప్పండి. అల్లాహ్ తాలా స్వయముగా సత్యవంతులను ప్రోత్సహిస్తాడు, వారికి సహాయం చేస్తాడు. అలాంటప్పుడు అతడు సత్యవంతులను శిక్షించడం జరుగుతుందా?. ఒకవేళ అదే జరిగినచో అప్పుడు ప్రపంచంలో సత్యం మాట్లాడడానికి ఎవరు సాహసించరు. దేవునిపై నుండి నమ్మకం పోతుంది. సత్యవంతులు ప్రాణాలున్నా కూడ నిశ్చేష్టులవుతారు. వాస్తవం ఏమిటనగా, నిజం చెప్పినా కూడ శిక్షించబడినచో అందుకు కారణం వారు నిజం చెప్పడం కాదు. ఆ శిక్ష వారికి వారి రహస్యమయమైన తప్పిదాలు, దుష్కార్యములు చేసినందున విధించబడుతుంది. ఎప్పుడో చెప్పిన అబద్దానికి శిక్షపడుతుంది. అల్లాహ్ సన్నిధిలో వారి తప్పుల, దుష్కార్యముల చిట్టా ఉంటుంది. వారు అనేక తప్పులు చేసి ఉంటారు. కావున ఏదో ఒక తప్పు కారణంగా వారు శిక్షించబడుతారు. **(అల్ హకమ్, సంపుటి 10, సంఖ్య 17, తేది 17 మే 1906, పేజి 4-5)**

**వాస్తవమేమనగా దైవారాధన తరువాత ఈ ప్రపంచంలో మానవుని ముందు ఉన్నటు వంటి గొప్ప సత్కార్యము మరియు అత్యంత కష్టమైన కార్యము నిజం చెప్పడం.**

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు గారు అల్ ఫుర్ఖాన్ అధ్యాయపు 73e d?¿ï **వల్లజీన లా యష్హదూన జ్జూర వ ఇజా మర్రూ బిల్లఘ్వి మర్రూ కిరామ** ను విశ్లేషిస్తూ ఇలా తెలిపారు:

వాస్తవమేమనగా దైవారాధన తరువాత ఈ ప్రపంచంలో మానవుని ముందు ఉన్నటు వంటి గొప్ప సత్కార్యము మరియు అత్యంత కష్టమైన కార్యము నిజం చెప్పడం. దయచూపించేవారు, న్యాయం చేసేవారు వేలాది మందిగా మనకు కనిపిస్తారు. కాని వారికి సాక్ష్యం చెప్పవలసి వచ్చినప్పుడు లేదా సాక్ష్యం చెప్పడం వలన వారి ప్రతిష్టకు, వారి బంధువులకు, వారి మిత్రులకు నష్టం జరుగుతుందని తెలిసినచో వారు అట్టి సాక్ష్యంలో ఎంతో కొంత మార్పులు చేర్పులు చేస్తారు. ఈ జబ్బు ఎంతగా విస్తరించిందనగా మన దేశంలో ప్రజలు ఎంతో ధైర్యముగా ప్రమాణాలు చేస్తూ కూడ అబద్ధం ఆడుతారు. ఆపై వారి అబద్ధాన్ని సత్యంగా ఎందుకు స్వీకరించడం లేదని కూడ వారు అసంతృప్తిని వ్యక్తపరుస్తుంటారు.

మొత్తానికి సత్యం చాలా ప్రాధాన్యత గలది. ప్రవక్తలు ఇందుకోసం ప్రత్యేక శ్రద్ధను కనబర్చారు. మానవ సుగుణాలలో ఇది ప్రాథమిక భాగం. కాని నేడు రాజకీయ, సామాజిక ప్రయోజనాల కోసం అబద్ధాన్ని అబద్ధమని భావించడమే లేదు. అబద్ధాన్ని చాలా అవసరమైన కార్యముగా భావిస్తున్నారు. వాస్తవానికి అబద్ధం వ్యక్తి స్వాభావికతకు వ్యతిరేకం. అబద్ధమనగా, చెవులు విన్న విషయాన్ని గూర్చి నేను వినలేదని చెప్పడం. కన్నులు చూసిన దృశ్యాన్ని గూర్చి నేను చూడలేదని చెప్పడం. చేతులు పట్టుకున్న వస్తువును గూర్చి నా చేతులు అట్టి వస్తువును పట్టుకోలేదని చెప్పడం. ఒక వ్యక్తి కాళ్ళు ఒకవైపు నడిచినా కూడ, అతడు నా కాళ్ళు అటువైపు నడవలేదని చెప్పడం. ఈ విధముగా మానవుడు అన్యులను కాకుండ తనను తానే ఖండించుకుంటూ ఉంటాడు. ఇంతకు మించిన వ్యతిరేకత స్వాభావికతకు ఏమి ఉంటుంది. ఊహాగానాలలో అనుమానం ఉండవచ్చును. కాని పంచ జ్ఞానేంద్రియాలను అనుమానించలేము. నిజానికి ఈ జ్ఞానేంద్రియా కార్యములకు భిన్నముగా పలుకే పలుకునే అబద్ధం అని అంటారు. తన జ్ఞానేంద్రియాలను ఖండించుకునే వ్యక్తి నిజానికి అతడు తన నాలుకను, చేతులను, కాళ్ళను, ముక్కును, చెవులను ఖండించుకున్న వాడగును. ఆపై అతడు తనకు వ్యతిరేకముగా తానే సాక్ష్యం మిచ్చు కోవడంలో ఎక్కువ మానసిక ఆనందంను పొందును. ఒక వ్యక్తి చేతులు ఒక వస్తువును పట్టుకుంటాయి.

**( 7వ పేజిలో చదువుము)**

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

عَنِ ابۡنِ مَسۡعُوۡدٍ رَضِیَ اللّٰہُ عَنۡہُ عَنِ النَّبِیِّ صَلَّی اللّٰہُ عَلَیۡہِ وَسَلَّمَ قَالَ : اِنَّ الصِّدۡقَ یَھۡدِیۡ اِلَی الۡبِرِّ ۔ وَاِنَّ الۡبِرَّ یَھۡدِیۡ اِلَی الۡجَنَّۃِ، وَاِنَّ الرَّجُلَ لَیَصۡدُقُ حَتّٰی یُکۡتَبَ عِنۡدَ اللّٰہِ صِدِّیۡقًا ۔ وَاِنَّ الۡکِذۡبَ یَھۡدِیۡ اِلَی الۡفُجُوۡرِ، وَاِنَّ الۡفُجُوۡرَ یَھۡدِیۡ اِلَی النَّارِ، وَاِنَّ الرَّجُلَ لَیَکۡذِبُ حَتّٰی یُکۡتَبَ عِنۡدَ اللّٰہِ کَذَّابًا۔

■హజ్రత్ ఇబ్నే మస్‌వూద్ రజి యల్లాహు అన్‌హుమా ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. సత్యము సత్కార్యమువైపు తీసుకవెళుతుంది. సత్కార్యము స్వర్గము వైపు నడిపిస్తాయి. ఏ మానవుడైతే ఎల్లప్పుడు సత్యము పలుకుతాడో అతడు అల్లాహ్ దృష్టిలో సత్యవంతుడని లిఖించబడుతాడు. అసత్యం పాపము, చెడు, ద్రోహం వైపు నడిపిస్తుంది. పాపము, చెడు, ద్రోహం నరకం వైపు తీసుకవెళ్ళుతాయి. కావున ఏ మానవుడైతే ఎల్లప్పుడు అసత్యం పలుకుతూ ఉంటాడో అతడు అల్లాహ్ దృష్టిలో అబద్ధీకుడు అని లిఖించబడుతాడు. **(బుఖారి, కితాబుల్ అదబ్, బాబ్ ఖౌలల్లాహ్ అత్తఖుల్లాహ్ వకూనూ మఅ స్సాదిఖీన్)**

عَنِ الۡحَسَنِ بۡنِ عَلِیٍّ رَضِیَ اللّٰہُ عَنۡہُمَا قَالَ حَفِظۡتُ مِنۡ رَسُوۡلِ اللّٰہِ صَلَّی اللّٰہُ عَلَیۡہِ وَسَلَّمَ، دَعۡ مَا یُرِیۡبُکَ اِلٰی مَالَا یُرِیۡبُکَ، فَاِنَّ الصِّدۡقَ طُمَانِیۡنَۃٌ وَالۡکِذۡبَ رِیۡبَۃٌ۔

హజ్రత్ హసన్ బిన్ అలీ రజి యల్లాహు అన్‌హు ఇలా తెలిపారు. నాకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఈ ఉపదేశం చాలా బాగా గుర్తున్నది. అదేమనగా సంకోచించదగిన విషయాలను వదిలి వేయుము. సంకోచము కంటే ఖచ్చితమై నమ్మకమును ఎంచుకొనుము. ఎందుకనగా నమ్మకమును కల్గించు సత్యము సంతృప్తిని చేకూర్చును. అబద్ధము ఆందోళన మరియు చింతనకు కారణమగును. **(బుఖారి కితాబుల్ బుయూ, బాబ్ తఫ్సీరు ష్షుబ్‌హాత్, తిర్మిజి, అబువాబుల్ ఖియామతి) (హదీఖతుస్సాలిహీన్..697)**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

ఈ యుద్ధానికి గల కారణాన్ని గూర్చి ఈ విధముగా పేర్కొనడం జరిగింది. ఈ యుద్ధానికి గల ప్రాధాన కారణమేమనగా, మక్కాకు చెందిన ఖురైష్‌లు హుదేబియా ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అంతేగాకుండా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి రాయబారితో ఎంతో గర్వంగా మేము ఒప్పందాన్ని రద్దు చేస్తున్నాము, మేము ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో యుద్ధం చేస్తాము అని అన్నారు.

---

మూర్ఖత్వపు కాలంలో బనూ ఖుజాఅ మరియు బనూ బకర్ తెగల మధ్య యుద్ధాలు జరిగేవి. ఈ క్రమంలో బనూ బకర్‌కు చెందిన ఒక వ్యక్తి బనూ ఖుజాఅకు చెందిన వ్యక్తి హతమార్చినాడు. అందువలన బనూ ఖుజాఅ తెగవారు బనూ బకర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను మక్కా నగరపు పొలిమెరలో హత్య చేశారు. బనూ బకర్ మరియు బనూ ఖుజాఅ వారు అలా అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. అనగా పరస్పరం యుద్ధాలు చేసుకుంటున్నారు.

---

హిజ్రి 8వ సం॥ షఅబాన్ మాసం వచ్చేనాటికి హుదేబియా ఒప్పందానికి 22 నెలలు గడిచిపోయాయి. ఈ తరుణంలో బనూ బకర్‌కు చెందిన ఒక వ్యక్తి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అవమానిస్తూ కవిత రాశాడు. అనగా హేళనతో కూడిన కవిత వ్రాసాడు. బనూ ఖజాఅ తెగకు చెందిన వ్యక్తి అతడు పాడుతుండగా విని అతనిని హత్య చేశాడు. అతని తలను పగలగొట్టాడు.

---

హారిస్ బిన్ హష్షామ్ అబూ సుఫ్యాన్ వద్దకు వచ్చి, ఖురైష్‌లు చేసిన పనిని గూర్చి తెలియజేశాడు. అబూసుఫ్యాన్ ఆ ఘటణను విని ఇలా అన్నాడు. ఈ పనిలో నేను పాల్గొనలేదు. అలా అని దీనితో సంబంధం లేకుండా లేను. ఇది చాలా చెడు పని. దేవుని ప్రమాణం! ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇకపై తప్పకుండా మనతో యుద్ధం చేస్తారు.

---

ప్రవక్త (స) హజ్రత్ జమ్రా రజిను ఖురైష్‌ల వద్దకు పంపారు. ఆపై మూడు అంశాలలో ఒకదానిని ఎంచుకొమ్మని చెప్పారు. ఒకటి వారు బనూ ఖుజాఅ వారి హత్యలకు పరిహారం చెల్లించడం. లేదా బనూ నుఫాసతో సంబంధాలను తెంచుకోవడం లేదా హుదేబియా ఒప్పందాన్ని రద్దు చేయడం.

---

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజికూడ చారిత్రక ఆధారాలతో ఈ విషయాన్ని ప్రస్తావించారు. మక్కావారు అబూసుఫ్యాన్‌ను మదీనాకు పంపారు. తద్వారా ముసల్మానులను ఏదో ఒక విధముగా దాడి చేయకుండా అపాలని చూశారు. అబూ సుఫ్యాన్ మదీనా చేరుకున్న తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై ఒత్తిడి తీసుకరావడానికి ప్రయత్నించాడు. హుదేబియా ఒప్పంద సమయంలో నేను లేను. కావున మరల నూతనంగా ఒప్పందం చేసుకుందాము.

---

ఈ ఘటనను గూర్చి తెలియజేస్తూ హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా పేర్కొన్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఒక శ్రీమతితో నా ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చేయడం ప్రారంభించుము అని అన్నారు. వారు రజి ప్రయాణ సామాగ్రిని సిద్ధం చేయడం ప్రారంభించారు. ఆపై ప్రవక్త (స) హజ్రత్ ఆయిషా రజితో నా కోసం సత్తుపిండి లేదా శెనిగలను వేయించి సిద్ధం చేయుము అని అన్నారు. ఆ రోజులలో ఇలాంటి పిండి పదార్థాలను భోజనంగా సిద్ధం చేసేవారు. కావున వారు శెనిగలలో ఉన్నటు వంటి మట్టిపెళ్ళలు మరియు చిన్న రాళ్ళను వేరుచేస్తూ గింజలను శుభ్రం చేయసాగారు.

---

ఇప్పుడు ఈరాన్‌పై కూడ ఇజ్రాయీల్ దాడి చేస్తుంది. ఈ యుద్ధం చాలా భయానక స్థితిలోకి మారిపోతుంది. ఇజ్రాయిల్ దేశ ప్రజలు ప్రస్తుతం ఒక్కొక్కటిగా ముస్లిం దేశాలన్నింటిని నాశనం చేయాలని చేస్తున్నారు. కాని ముస్లిం దేశస్థులు నిద్రపోతున్నారు. తమ అభివృద్ధి మరియు తమ ఇతర అవసరాలకు ప్రాధాన్యత నిస్తూ వాటి సాధనలోనే నిమగ్నమైపోయారు. ఏం జరుగుతుందో వారికి అర్థం కావడం లేదు. ముసల్మానుల నడవడిక సరిగ్గా లేదు. వారికి దుఆ వైపు శ్రద్ధ కూడ కలుగడం లేదు.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 13 జూన్ 2025, ( 13 ఎహ్‌సాన్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

కొన్ని జుమాలకు ముందు మక్కా విజయాన్ని గూర్చిన ప్రారంభ ప్రస్తావన జరిగింది. నేడు ఆ అంశానికి చెందిన మరిన్ని వివరాలను ప్రస్తావించుతాను.

ఈ యుద్ధానికి గల కారణాన్ని గూర్చి ఈ విధముగా పేర్కొనడం జరిగింది. ఈ యుద్ధానికి గల ప్రాధాన కారణమేమనగా, మక్కాకు చెందిన ఖురైష్‌లు హుదేబియా ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అంతేగాకుండా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి రాయబారితో ఎంతో గర్వంగా మేము ఒప్పందాన్ని రద్దు చేస్తున్నాము, మేము ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో యుద్ధం చేస్తాము అని అన్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు ఈ సమాచారం అందగానే ప్రవక్త (స) మక్కా వైపు బయలుదేరినారు. వారి ఉల్లంఘనకు చెందిన వివరాలు ఈ విధముగా గలవు. హుదేబియా ఒప్పందం జరిగినప్పుడు అందులో ఒక షరతు ఈ విధముగా గలదు. అరబ్‌కు చెందిన తెగలలో కోరిన వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ఒప్పందం చేసుకోవచ్చును. కోరినవారు ఖురైష్‌లతో ఒప్పందం చేసుకోవచ్చును. అందువలన మక్కాకు చుట్టు ప్రక్కల ఉన్నటు వంటి బనూ బకర్ మరియు బనూ ఖుజాఅకు చెందిన తెగలలో బనూ ఖుజాఅ తెగవారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ఒప్పందం చేసుకున్నారు. అందుకు భిన్నముగా బనూ బకర్ తెగవారు ఖురైష్‌లతో ఒప్పందం చేసుకున్నారు. అలా ఈ రెండు తెగలు పరస్పరం యుద్ధాల నుండి సురక్షితముగా ఉన్నారు. **(ఫతహుల్ బారి, షరఅ సహి బుఖారి, సంపుటి 7, పేజి 661, ఆరామ్ బాఘ్ కరాచి)(ఫతహ్ మక్కా బాష్మీల్ పేజి 90, 111, నఫీస్ అకాడమీ కరాచి)(ఘజ్వాత్ వ సరాయ, ముహమ్మద్ అజ్‌హర్ ఫరీద్ పేజి 445, ఫరీదీయ పబ్లీషర్ సాహెూవాల్)**

మూర్ఖత్వపు కాలంలో బనూ ఖుజాఅ మరియు బనూ బకర్ తెగల మధ్య యుద్ధాలు జరిగేవి. ఈ క్రమంలో బనూ బకర్‌కు చెందిన ఒక వ్యక్తి బనూ ఖుజాఅకు చెందిన వ్యక్తి హతమార్చినాడు. అందువలన బనూ ఖుజాఅ తెగవారు బనూ బకర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను మక్కా నగరపు పొలిమెరలో హత్య చేశారు. బనూ బకర్ మరియు బనూ ఖుజాఅ వారు అలా అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. అనగా పరస్పరం యుద్ధాలు చేసుకుంటున్నారు. ఆ మధ్య కాలంలోనే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అవతరణ జరిగింది. ప్రవక్త (స) ప్రకటన చేయగా, ప్రజలు ఇస్లాంను గూర్చి తెలుసుకోవడంలోనే నిమగ్నమైపోయారు. వారి ముందుకు ఒక నూతన ధర్మం వచ్చింది. ఆ ధర్మంను గూర్చి చర్చలు జరుగుతున్నాయి. కావున వారు పరస్పరం దూరంగా ఉన్నారు. కాని వారి మనస్సులో కోపం, ద్వేషం అలాగే ఉండిపోయాయి.

హిజ్రి 8వ సం॥ షఅబాన్ మాసం వచ్చేనాటికి హుదేబియా ఒప్పందానికి 22 నెలలు గడిచిపోయాయి. ఈ తరుణంలో బనూ బకర్‌కు చెందిన ఒక వ్యక్తి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అవమానిస్తూ కవిత రాశాడు. అనగా హేళనతో కూడిన కవిత వ్రాసాడు. బనూ ఖజాఅ తెగకు చెందిన వ్యక్తి అతడు పాడుతుండగా విని అతనిని హత్య చేశాడు. అతని తలను పగలగొట్టాడు. ఈ ఘటనతో ఇరు తెగలలో మరల ఘర్షణ వాతవరణం నెలకొన్నది. నిజానికి ఈ రెండు తెగలవారు ముందు నుండే శత్రువులు. తాత్కాలికంగా వారి శత్రుత్వంను ప్రక్కనపెట్టారు. బనూ బకర్ తెగకు చెందిన ఏ వ్యక్తి అయితే ఇలాంటి అవమానకరమైన కవితను వ్రాసాడో

అతడు బనూబకర్ తెగకు చెందిన బనూ నుఫాస అనే కుటుంబానికి చెందినవాడు. ఎప్పుడైతే ఆ కవిని బనూ ఖుజాఅకు చెందిన వ్యక్తి గాయపరిచాడో అప్పుడు బనూ నుఫాస వారు ఖురైష్‌లతో బనూ ఖుజాఅకు వ్యతిరేకముగా సైన్యాన్ని ఆయుధాలను సహాయంగా పంపమని అభ్యర్థించారు.

వారికి సహాయం చేయడానికి ఖురైష్‌లు ముందుకు వచ్చారు. కాని అబూ సుఫ్యాన్ నిరాకరించాడు. అబూసుఫ్యాన్‌తో వారు సలహా తీసుకోలేదు, అతనికి విషయమే తెలియదు. మరొక కథనములో సలహాలు తీసుకోగా, వారు సహాయం చేయడానికి నిరాకరించినట్లుగా గలదు. అనగా యుద్ధం చేయకూడదని వారించారు. కాని ఖురైష్‌లు మాత్రం అతని మాటను లెక్కచేయకుండా వారికి ఆయుధాలను, గుర్రాలను, సైనికులను ఇచ్చి సహాయం చేశారు. వారందరు రహస్యముగా దాడి చేయగా, బనూ ఖుజాఅ వారు ఆ దాడిని ఎదుర్కొనలేక పోయారు. బనూ ఖుజాఅ వారు ఒప్పందం కారణంగా తాము సురక్షితముగా ఉన్నామని భావించారు. నిర్లక్ష్యముగా ఉన్నారు. ఖురైష్‌లు, బనూ బకర్ మరియు బనూ నుఫాసా వారు వతీర్ ప్రాంతంలో కలుసుకుందాం అని వాగ్దానం చేసుకున్నారు. ఈ ప్రాంతం మక్కాకు చాలా దగ్గరగా ఉన్నది. అనగా మక్కాకు నైరుతి దిశలో మక్కా పొలిమెర నుండి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. బనూ ఖుజాఅ నివాసాలు కూడ అక్కడే ఉన్నాయి. ఈ వ్యతిరేకులందరు నిర్ణయిత సమయానికి అక్కడికి చేరుకున్నారు. ఖురైష్‌ల నాయకులు వేషం మార్చారు. ముసుగులు ధరించారు. వారిలో సఫ్వాన్ బిన్ ఉమయ్య, ఇక్రమా బిన్ అబూ జహల్, హువైతిబ్ బిన్ అబ్దుల్ ఉజ్జా, షయిబా బిన్ ఉస్మాన్ మరియు మిక్రజ్ బిన్ హఫ్‌సలు ఉన్నారు. వారందరితో పాటు వారి బానిసలు కూడ తోడుగా ఉన్నారు. బనూ బకర్ నాయకుడైన నౌఫిల్ బిన్ ముఆవియా కూడ తోడుగా ఉన్నాడు. బనూ ఖుజాఅ అజ్ఞానంతో సంతృప్తిగా రాత్రి వేళ నిద్రిస్తున్నారు. వారిలో అధికులు పిల్లలు, మహిళలు, వృద్ధులే ఉన్నారు. బనూ నుఫాస మరియు ఖురైష్‌లు కలిసి వారిపై దాడి చేశారు. దొరికిన వారిని దొరికినట్లుగా నరికివేయసాగారు. కొంత మంది తప్పించుకోని మక్కా పొలిమెరలోకి పారిపోయారు. బనూ ఖుజాఅ వారు బనూ బకర్ నాయకుడైన నౌఫిల్ బిన్ ముఆవియాతో ఇలా అన్నారు. ఓ నౌఫిల్! మేము ఇప్పుడు పవిత్రమైన మక్కా నగరంలోకి ప్రవేశించాము. మీ దేవుళ్ళ కోసమైన మమ్ము విడిచి పెట్టండి. అందుకు నౌఫిల్ ఎంతో గర్వముగా ఇలా అన్నాడు. ఈ రోజు ఏ దేవుడిని పట్టించుకునేది లేదు. ఆపై మక్కా నగర భూభాగంలో కూడ హత్యలు చేస్తూ రక్తపాతాన్ని సృష్టించారు. బనూ బకర్ తెగవారు ఆ రోజు బనూ ఖుజాఅకు చెందిన 20 మందిని హత్య చేశారు. ఏది ఏమైన తరువాత ఖురైష్‌లు వారి చేసిన దానికి సిగ్గుపడ్డారు. ఆందోళన కూడ చెందారు. వారు చేసిన పనితో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఖురైష్‌ల మధ్య జరిగిన ఒప్పందం రద్దు అయినదని వారు గ్రహించారు. సుహైల్ బిన్ అమర్ నౌఫిల్‌తో ఇలా అన్నాడు. మేము మీతో మరియు మీ మిత్రులతో కలిసి ప్రజలను హత్యచేసిన విషయం నీకు బాగా తెలుసు. నీవు వారిని కౄరముగా చంపివేశావు. మిగిలిన వారిని కూడ చంపాలనుకుంటున్నావు. కాని మేము ఇకపై మీరు చెప్పినట్లు వినము. కావున వారిని వదిలి వేయుము అని అన్నాడు. అందుకు నౌఫిల్ వారిని వదిలి వేశాడు. వారు వెళ్ళిపోయారు. హారిస్ బిన్ హిష్షామ్ మరియు అబ్దుల్లాహ్ బిన్ అబీ రబీ ఇరువురు కలిసి సఫ్వాన్ బిన్ ఉమయ్య, సుహైల్ బిన్ అమర్ , ఇక్రమా బిన్ అబూ జహల్ వద్దకు వెళ్ళారు. వారిని బనూ ఖుజాఅకు వ్యతిరేకముగా బనూ బకర్‌కు సహాయం చేసినందుకు తీవ్రముగా దూషించారు. మీరు ఏమిచేశారు?. మీరు ఒప్పందం చేసుకున్నారు. మీరు చేసిన పనితో మన మధ్య మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మధ్య జరిగిన ఒప్పందంను రద్దు చేసినవారైనారు. **(సుబూలుల్ హుదా సంపుటి 5, పేజి 200-201, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(ముఅజముల్ ముఆలముల్ జాగ్రఫియతు ఫీ సీరతున్న బవియ్యతు పేజి 331, దారుల్ మక్తల్ లిన్నషర్ వత్తౌజీ 1982)( అత్తబ్ఖాతుల్ కుబ్రా సంపుటి 2, పేజి 102, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(సీరతుల్ హలబియ్య సంపుటి 3, పేజి 103 దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(ఫతహ్ మక్కా బిష్మెల్ పేజి 98, నఫీస్ అకాడమీ కరాచి)(ఘజ్వాతున్నబ్వి (స) ముహమ్మద్ అబ్దుల్ అహద్ పేజి 430, ప్రచురణ జావియా పబ్లీషర్ లాహొూర్)(ఘజ్వాత్‌వ సరాయా ముహమ్మద్ అజ్‌హర్ ఫరీద్ పేజి 446, ఫరీద్ పబ్లికేషన్, సాహేవాల్)**

హారిస్ బిన్ హష్షామ్ అబూ సుఫ్యాన్ వద్దకు వచ్చి, ఖురైష్‌లు చేసిన పనిని గూర్చి తెలియజేశాడు. అబూసుఫ్యాన్ ఆ ఘటనను విని ఇలా అన్నాడు. ఈ పనిలో నేను పాల్గొనలేదు. అలా అని దీనితో సంబంధం లేకుండా లేను. ఇది చాలా చెడు పని. దేవుని ప్రమాణం! ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇకపై తప్పకుండా మనతో యుద్ధం చేస్తారు. అబూసుఫ్యాన్ మరల ఇలా అన్నాడు. నా భార్య హిందా నాకు తాను చూసిన ఒక భయంకరమైన కలను గూర్చి చెప్పింది. ఆమే ఆ కలలో ఇలా చూసింది. ముహస్సిబ్ వైపు ఖాన కాబా నుండి ఒకటిన్నర మైళ్ళ దూరంలో ఉన్నటు వంటి హజూన్ అనే కొండ నుండి రక్తపు ఒక నది ప్రవహిస్తూ వస్తుంది. అది ఖందమా వరకు చేరుకున్నది. ఖందమా అనేది మనా యొక్క మార్గంలో ఉన్నటు వంటి మక్కాకు చెందిన ప్రముఖ కొండ. ప్రజలు దానిని అయిష్టపడ్డారు. **(సీరతుల్ హలబియ, సంపుటి 3, పేజి 103, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(ఫ్రాంగ్ సీరత్ పేజి 100, 116, జవార్ అకాడమీ కరాచి)** అనగా ఆ రక్తం ప్రవహిస్తూ వస్తుంది. దానిని చూసి ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. మొత్తానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు బనూ ఖుజాఅపై చేసిన దాడిని గూర్చి దివ్యదృశ్యం ద్వారా అల్లాహ్ తాలా తెలియజేశాడు.

విశ్వాసుల తల్లి హజ్రత్ మైమూన బిన్ హారిస్ రజి ఇలా తెలిపారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒకరాత్రి వారి ఇంట్లో గడిపారు. ప్రవక్త (స) నమాజ్ చదవడం కోసం వజూ కొరకు మేల్కొన్నారు. ప్రవక్త (స) వజూ చేసుకుంటున్న ప్రాంతంలో ప్రవక్త (స) మూడు సార్లు లబ్బైయిక లబ్బైయిక అబ్బైయిక అని పలకడాన్ని నేను విన్నాను. అనగా నేను ఉన్నాను, నేను ఉన్నాను, నేను ఉన్నాను. ఆ తరువాత మూడు సార్లు నుసిర్‌త, నుసిర్‌త, నుసిర్‌త అని పలకడాన్ని విన్నాను. అనగా మీకు సహాయం చేయబడింది, మీకు సహాయం చేయబడింది, మీకు సహాయం చేయబడింది. ప్రవక్త (స) వజూ చేసుకోని వచ్చిన తరువాత నేను ఇలా అడిగాను. ఓ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం! మీరు మూడు సార్లు లబ్బైయిక, మూడు సార్లు నుసిర్‌త అని పలకడాన్ని విన్నాను. మీ వద్ద ఎవరైన ఉన్నారా? మీరు వారితో మాట్లాడుతున్నారా?. అందుకు ప్రవక్త (స) " బనూ కఅబ్ బిన్ ఖుజాఅకు చెందిన ఒక తెగ వ్యక్తి బనూ బకర్‌కు వ్యతిరేకముగా పద్యాలు చదువుతూ నన్ను సహాయం కోసం పిలుస్తున్నాడు. ఇది దివ్యదృశ్యం. అతడు ఖురైష్‌లు వారికి వ్యతిరేకముగా బనూబకర్ తెగవారికి సహాయంను అందించారు అని నాతో అన్నాడు " అని సమాధానం ఇచ్చారు. హజ్రత్ మైమూన రజి ఇలా పేర్కొన్నారు. మూడు రోజుల తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలకు ఫజర్ నమాజ్ చదివించిన తరువాత ఒక వ్యక్తి ఈ క్రింది పంక్తులను చదవడాన్ని విన్నాను.

యా రబ్బి ఇన్ని నాషిదున్ మ్ముహమ్మదన్
హిల్‌ఫ అబీన వ అబీహిల్ అత్‌లదా

ఓమా సంరక్షకుడా! నేను ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు మా పూర్వీకులు మరియు వారి పూర్వీకులు పరస్పరం చేసుకున్న ఒప్పందంను గూర్చి గుర్తుచేస్తున్నాను.

మరొక కథనములో ఈ విధముగా గలదు. బనూ నుఫాస మరియు బనూ ఖుజాఅ ప్రజల ద్వారా వతీర్ ప్రాంతంలో రాత్రి జరిగిన ఘటన తరువాత ఉదయం వేళ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఆయిషా రజితో ఇలా అన్నారు. ఓ ఆయిషా! ఖుజాఅ తెగలో ఏదో ఘటన చోటు చేసుకున్నది. హజ్రత్ ఆయిషా రజి " ఓ దైవ ప్రవక్త (స)! మీ మరియు వారి మధ్య జరిగిన ఒప్పందాన్ని ఉల్లంఘించుటకు ఖురైష్‌లు ధైర్యం చేయగలరా?. నిజానికి ఇప్పటికే వారిని యుద్ధాలు నాశనం చేశాయి కదా!" అని విన్నవించుకున్నారు.

అందుకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సమాధానం ఇచ్చారు. వారు ఆ ఒప్పందాన్ని అల్లాహ్ తాలా సంకల్పించుకున్న దాని కోసం ఉల్లంఘించారు. హజ్రత్ ఆయిషా రజి ఇలా అన్నారు. ఓ దైవ ప్రవక్త (స)! ఇందులో కూడ ఏదైన మేలు జరుగనుందా?. అందుకు ప్రవక్త (స) " అవును . ఇందులో మేలు ఉన్నది" అని అన్నారు. అనగా ఇది అల్లాహ్ ఆకాంక్ష మేరకే జరిగింది. వారి ఒప్పందాన్ని ఉల్లంఘించాలి. అందుకు వారు శిక్షించబడాలి.

**(సుబూలుల్ హుదా సంపుటి 5, పేజి 201-202, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(షరఅ అల్లామా జర్కాని సంపుటి 3, పేజి 380-381 దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

మొత్తానికి ఆ ఘటనను గూర్చి హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు ఇలా పేర్కొన్నారు. తమ దృష్టికోణంతో వారు ఇలా వ్రాసారు. హజ్రత్ మైమూన రజి ఇలా తెలిపారు. ఒకరాత్రి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నా ఇంట్లో పడుకున్నారు. ప్రవక్త (స) తహజ్జుద్ నమాజ్ కోసం మేల్కొని వజూ చేసుకొనుచుండగా ఇలా పలికారు. ఆ మాటలను నేను విన్నాను. ప్రవక్త (స) ఇలా పలికారు. లబ్బైయిక లబ్బైయిక లబ్బైయిక ఆ తరువాత ప్రవక్త (స) నుసిర్‌త నుసిర్‌త నుసిర్‌త అని పలికారు. వారు రజి ఇలా తెలిపారు. ప్రవక్త (స) తిరిగి వచ్చిన తరువాత నేను ఇలా అడిగాను. ఓ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం! ఎవరైనా వచ్చారా? మీరు వారితో మాట్లాడినారా?. అందుకు ప్రవక్త (స) " అవును నా ముందుకు దివ్యదృశ్యం ద్వారా ఖుజాఅ తెగకు చెందిన ఒక బృందం వచ్చింది. వారు " మేము ముహమ్మద్ (స) మరియు వారి దేవుని ప్రమాణంగాఅ చెబుతున్నాము. మేము మీతో మరియు మీ పూర్వీకులతో ఒప్పందాలు చేసుకున్నాము. మేము మీకు సహాయం చేస్తు వస్తున్నాము. కాని ఖురైష్‌లు మాతో ఒప్పంద ఉ

ల్లంఘనలు చేశారు. రాత్రి సమయంలో మాపై దాడులు చేశారు. ఆ సమయంలో మాలో కొందరు సజ్దాలు చేస్తున్నారు. మరి కొందరు రుకూలు చేస్తున్నారు. మమ్ములను హతమార్చినారు. కావున ఇప్పుడు మేము మీ సహాయం కోసం వచ్చాము " అని అరుస్తూ వస్తున్నారు. మొత్తానికి నేను చూశాను. అనగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పుచున్నారు. నేను చూశాను. ఖుజాఅ తెగకు చెందిన ఒక వ్యక్తి నా ముందు నిలబడి ఉన్నాడు. దివ్యదృశ్యంలో అతడు నాకు కనిపించినప్పుడు నేను అతనితో లబ్బైయిక లబ్బైయిక లబ్బైయిక అనగా నేను మీకు సహాయం చేయడానికి సిద్ధముగా ఉన్నాను అని మూడు సార్లు పలికాను. ఆ తరువాత నేను నుసిర్త నుసిర్త నుసిర్త అనగా మీకు సహాయం అందించబడుతుంది అని మూడు సార్లు పలికాను అని అన్నారు. మరల హజ్రత్ ఆయిషా రజి ఇలా తెలిపారు. ఆ రాత్రి తెల్లవారు చుండగానే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నా ఇంటికి వచ్చారు. మరియు నాతో ప్రవక్త (స) ఇలా అన్నారు. ఖుజాఅ తెగవారి విషయంలో భయంకరమైన దుర్ఘటన చోటు చేసుకున్నది. హజ్రత్ ఆయిషా రజి ఇలా తెలిపారు. అందుకు నేను " ఖుజాఅ తెగవారు మక్కా పొలిమెరకు సమీపంలో ఉన్నారు. కావున బనూ బకర్‌తో ఒప్పందం చేసుకున్న మక్కావారు ఖుజాఅ తెగవారిపై దాడి చేసి ఉండవచ్చును. ఇదే ఖుజాఅ తెగవారికి భయంకరమైన దుర్ఘటన" అని నేను అర్థం చేసుకున్నాను. కావున నేను ఇలా అడిగాను. ఓ దైవ ప్రవక్త (స)! ఇన్ని ప్రమాణాలు చేసిన తరువాత కూడ ఖురైషులు ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారనునది సాధ్యమా?. వారు ఖుజాఅ తెగవారిపై దాడి చేయగలరా?. ప్రవక్త (స) ఇలా అన్నారు. అవును అల్లాహ్ తాలా ఆకాంక్ష మేరకు వారు ఒప్పందాన్ని ఉల్లంఘించ వచ్చును. ఆ ఆకాంక్ష ఏమిటనగా, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు దాడి చేయుటకు అనుమతి లేదు. ఒప్పందం ఉల్లంఘించడం ద్వారా అట్టి అనుమతి లభించింది. హజ్రత్ ఆయిషా రజి ఇలా తెలిపారు. " ఓ దైవ ప్రవక్త (స) ! దీని ఫలితం బాగుంటుందా?." అని అడిగాను. అందుకు ప్రవక్త (స) అవును బాగుంటుంది అని అన్నారు. **(సీరే రూహాని అన్వారుల్ ఉలూమ్, సంపుటి 24, పేజి 251-252)**

ఈ ఘటన వివరాలలో ఈ విధముగా వ్రాసారు. బనూ బకర్ మరియు ఖురైషుల ఇంతటి దారుణమైన ఘటన తరువాత అమర్ బిన్ సాలిమ్ బనూ ఖుజాఅ కు చెందిన 40 మంది స్వారీలతో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను సహాయం అడగడం కోసం బయలు దేరినాడు. ఖుజాఅ తెగ నాయకుడైన బుదైల్ బిన్ వర్ఖా ఖుజాఇఅ కూడ ఈ బృంధంలో ఉన్నాడు. అతడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు జరిగిన దుర్ఘటన గురించి, వారు ఎలాంటి సమస్యను ఎదుర్కొన్నారో, ఖురైషులు ఏ విధముగా వారి వ్యతిరేకముగా బనూ బకర్‌కు ఆయుధాలతో, సైన్యంతో, గుర్రాలతో సహాయం చేశారో, ఏ విధమగా సఫ్వాన్, ఇక్రమా, మరియు ఖురైషులకు చెందిన ఇతర నాయకులు వారిని చంపివేయడంలో పాల్గొన్నారో వివరముగా తెలియజేశాడు. ఆ సమయంలో ప్రవక్త (స) మస్జిద్‌లో అనుచరులతో కలిసి కూర్చొని ఉన్నారు. అతడు తన వంతుగా మాట్లాడిన తరువాత ఖుజాఅ తెగ మరొక నాయకుడు అమర్ బిన్ సాలిమ్ నిలబడి కొన్ని పంక్తులను పాడుతూ సహాయాన్ని అర్థించాడు. వాటిలో ఒక పంక్తి ఇలా గలదు.

యా రబ్బి ఇన్ని నాషిదున్ మ్ముహమ్మదన్
హిల్ఫ అబీన వ అబీహిల్ అత్‌లదా

ఓమా సంరక్షకుడా! నేను ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు మా పూర్వీకులు మరియు వారి పూర్వీకులు పరస్పరం చేసుకున్న ఒప్పందంను గూర్చి గుర్తుచేస్తున్నాను.

**(సుబూలుల్ హుదా సంపుటి 5, పేజి 202-203, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(సీరతుల్ హలబియ్యా సంపుటి 3, పేజి 103, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(ఫ్రాంగ్ సీరత్ పేజి 56, జవార్ అకాడమీ కరాచి)**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజి ఇలా తెలిపారు. బనూ ఖుజాఅకు చెందిన బృంధం ప్రవక్త (స ) వద్దకు చేరుకున్నప్పుడు ప్రవక్త (స) వారిని " మీ అంచనా ప్రకారంగా ఈ దైర్జన్యానికి ఎవరు పాల్పడి ఉంటారు? " అని అడిగారు. అందుకు వారు బనూ బకర్ అని సమాధానం ఇచ్చారు. ప్రవక్త (స) " బనూ బకర్ తెగవారందరా? " అని అడిగారు. అందుకు వారు కాదు, బనూ నుఫాస వంశానికి చెందిన వారు, వారి నాయకుడైన నౌఫిల్ బిన్ ముఆవియా అని సమాధానం ఇచ్చారు. ప్రవక్త (స) ఇలా అన్నారు. అది కూడ బనూ బకర్‌కు చెందిన తెగయే. మొత్తానికి బనూ ఖుజాఅ వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మొత్తం ఘటనను గూర్చి వివరించిన తరువాత ప్రవక్త (స) వారితో "మీరు వేరు వేరుగా తిరిగి వెళ్ళండి. మీరు తిరిగి వెళ్ళుతున్నారు. కావున బృంధంగా వెళ్ళకండి. వేరు వేరుగా వెళ్ళండి" అని అన్నారు. ప్రవక్త (స) ఇలా ఎందుకు అన్నారనగా, వారు ప్రవక్త (స) ను కలిసి వస్తున్నట్లుగా ఎవరికి తెలియకుండ జాగ్రతగా ఉండాలి. ఈ విషయాన్ని గోప్యముగానే ఉంచాలి. కావున బనూ ఖుజాఅ వారు వేరు వేరు గుంపులుగా తిరిగి వెళ్ళిపోయారు. వారిలో కొందరు మార్గ మధ్యలోనే సముద్ర తీరపు దారి వైపు వెళ్ళారు. బుదైల్ బిన్ వర్ఖాతో ఉన్నవారు సాధారణమైన మార్గంలో వెళ్ళిపోయారు. హజ్రత్ ఆయిషా రజి ఇలా తెలిపారు. ప్రవక్త (స) బనూ కఅబ్ అనగా ఖుజాఅ వారికి జరిగిన అన్యాయం వలన చాలా కోపంగా ఉన్నారు. ప్రవక్త (స) అంత కోపంగా ఉండడాన్ని నేను ఎన్నడు చూడలేదు.

హజ్రత్ ఇబ్నే అబ్బాస్ రజి ఇలా ఉల్లేఖించారు. ప్రవక్త (స)కు ఖుజాఅ తెగ వారిపై జరిగిన దుర్ఘటన గురించి తెలియగానే ఇలా అన్నారు. నా ప్రాణాలు అరచేతిలో ఉన్నటు వంటి దైవం ప్రమాణం! నేను ఏ విధముగానైతే నా కుటుంబ సభ్యులను, నా సంతానాన్ని కాపాడుకుంటున్నానో అదే విధముగా వారిని అన్ని రకాలుగా కాపాడుతాను.

**(సుబూలుల్ హుదా సంపుటి 5, పేజి 203-204, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(సీరతుల్ హలబియ్య సంపుటి 3 పేజి 104, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

ఈ దుర్ఘటనను గూర్చి హజ్రత్ ముస్లేహ్‌మౌవూద్ రజి తమ దృష్టి కోణంలో ఇలా వివరణాత్మకముగా తెలియజేశారు. " హిజ్రి 8వ సంవత్సరం రమజాన్ మాసంలో......దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అరబ్‌లో ఇస్లాంను సుస్థిర పర్చునట్టి ఈ చివరి యుద్ధం కోసం బయలుదేరినారు. ఆ ఘటన ఇలా చోటు చేసుకున్నది. హుదేబియ ఒప్పంద సమయంలో అరబ్‌కు చెందిన తెగలు కోరుకున్న వారు మక్కా వారితో కలువవచ్చును. కోరుకున్న వారు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలువవచ్చును అని, అదే విధముగా మరో 10 సంవత్సరాల పాటు ఎలాంటి యుద్ధానికి పాల్పడకూడదని, ఆట ఒకవేళ పరస్పరం దాడి చేసుకొని ఒప్పందంను ఉల్లంఘించినచో యుద్ధం చేసుకోవడానికి అనుమతి ఉంటుందని తీర్మాణించుకున్నారు. ఈ ఒప్పందం మేరకు అరబ్‌కు చెందిన బనూ బకర్ తెగవారు మక్కావారితో కలిసిపోయారు. ఖుజాఅ తెగవారు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లలల్లాహు అలైహి వసల్లంతో కలిసిపోయారు. అరబ్‌కు చెందిన అవిశ్వాసులు సహజంగా ఒప్పందాలకు కట్టుబడి ఉండరు. ప్రత్యేకించి ముసల్మానులతో చేసుకున్న ఒప్పందాలకు అస్సలు కట్టుబడి ఉండరు. అందువలన బనూ బకర్ తెగవారికి ఖుజాఅ తెగవారితో పూర్వపు తగాద ఉన్నందున, హుదేబియా ఒప్పందం తరువాత కొంత కాలం వేచి యుండి, ఆ తరువాత మక్కావారితో " ఖుజాఅ తెగవారు ఒప్పందం వలన పూర్తిగా అజాగ్రతగా ఉన్నారు. కావున మనం ప్రతీకారం తీర్చుకోవడానికి ఇదే సరైన సమయం" అని చర్చించుకున్నారు. కావున మక్కావారు మరియు బనూ బకర్‌కు చెందిన వారు కలిసి ఒక రాత్రివేళ బనూ ఖుజాఅ వారిపై అకస్మత్తుగా దాడి చేసి వారిలో చాలా మందిని చంపివేశారు. ఖురైషులు మరియు బనూ బకర్ తెగవారు కలిసి ఈ దాడి చేశారని ఖుజాఅ తెగవారు గుర్తించినప్పుడు వారు ఈ ఒప్పంద ఉల్లంఘనను గూర్చి దైవప్రవక్త (స)కు తెలియజేయడం కోసం 40 మందితో కూడిన ఒక బృంధాన్ని మదీనాకు పంపారు. మరియు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ఒప్పందం ప్రకారం ఇప్పుడు మా తరుపున ప్రతీకారం తీర్చుకోవడం మీ బాధ్యత. కావున మక్కాపై దాడి చేయండి అని అభ్యర్థించుకున్నారు. ఈ బృందం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకోగా, ప్రవక్త (స) ఇలా అన్నారు. మీ బాధ, నా బాధ. నేను నా ఒప్పందానికి కట్టుబడి ఉన్నాను. " మరల ఇలా అన్నారు. " మేఘాల నుండి కురుస్తున్న వర్షం వలే ( ఆ సమయంలో అక్కడ వర్షం కురుస్తుంది) ఏ విధముగానైతే వర్షం కురుస్తుందో అదే విధముగా అంతే త్వరగా మీకు సహాయం అందించుటకు ఇస్లామీయ సైన్యం చేరుకుంటుంది." **(దిబాచ తఫ్సీరుల్ ఖుర్‌ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పేజి 336-337)**

మరొక కథనములో ఇలా గలదు. ప్రవక్త (స) హజ్రత్ జమ్రా రజిను ఖురైషుల వద్దకు పంపారు. ఆపై మూడు అంశాలలో ఒకదానిని ఎంచుకొమ్మని చెప్పారు. ఒకటి వారు బనూ ఖుజాఅ వారి హత్యలకు పరిహారం చెల్లించడం. లేదా బనూ నుఫాసతో సంబంధాలను తెంచుకోవడం లేదా హుదేబియా ఒప్పందాన్ని రద్దు చేయడం.

ఈ మూడు అంశాలను ప్రస్తావించడం జరిగింది. హజ్రత్ జమ్రా రజి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి రాయబారిగా ఖురైషుల వద్దకు చేరుకున్నాడు. ఖాన కాబా యొక్క ద్వారం ముందు తన ఒంటెను కూర్చోబెట్టాడు. లోపలికి వెళ్ళాడు. ఖురైషులు వారి వారి చోట కూర్చొని ఉన్నారు. హజ్రత్ జమ్రా రజి తాను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి రాయబారిగా వచ్చానని వారికి తెలియజేశాడు. వారికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి సందేశాన్ని అందించాడు. అప్పుడు ఖరజహ బిన్ అబ్‌ది అమర్ ఇలా అన్నాడు. ఒకవేళ మేము బనూ ఖజాఅ వారి మృతులకు పరిహారం చెల్లించవలసి వచ్చినచో మా వద్ద ధాన్యం మిగలదు, మా జంతువులు మిగలవు. ఎందుకనగా అంతమందికి పరిహారం

చెల్లించడానికి చాలా పెద్ద మొత్తంలో నగదు కావలసి ఉంటుంది. ఒక బనూ నుఫాసా తో తెగతెంపులు చేసుకొను విషయానికి వచ్చినచో ఖాన కాఅబాను వారి వలే గౌరవించే మరే తెగ కూడ అరబ్‌లో లేదు. పైగా వారు మా మిత్రులు. కావున మేము వారిని వేరుచేకోలేము. మా వద్ద శక్తి ఉన్నంత వరకు మేము వారిని దూరం చేసుకోలేము. అం మేము ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో యుద్ధం చేస్తాము. అతడు మేము యుద్ధం చేస్తామని అన్నాడు. అందువలన మేము ఒప్పందాన్ని రద్దు చేస్తున్నాము. అనగా హుదేబియా ఒప్పందాన్ని రద్దు చేస్తున్నాము. హజ్రత్ జమ్రా రజి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి తిరిగి వచ్చాడు. ఖురైష్‌ల అభిప్రాయాలను గూర్చి ప్రవక్త (స)కు తెలియజేశారు. మొత్తానికి తరువాత ఖురైష్‌లు తాము చేసిన తప్పిదానికి సిగ్గుపడ్డారు. వారు అబూసుఫ్యాన్ ను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు పంపారు.

**(సుబూలుల్ హుదా సంపుటి 5, పేజి 204-205, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(ఫతహ్ మక్కా బాష్మీల్, పేజి 111, నఫీస్ అకాడమీ కరాచి)**

అతడి రాక గురించి కూడ అనగా అబూసుఫ్యాన్ వస్తున్నాడని అల్లాహ్ తాలా ముందుగానే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియజేశాడు. కావున దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి పరంగా ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేశారు.

మొత్తానికి అబూసుఫ్యాన్ మరొసారి ఒప్పందం చేసుకోవడానికి వచ్చాడు. ఈ విషయానికి చెందిన వివరాలు ఈ విధముగా లిఖించబడ్డాయి. అం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అబూ సుఫ్యాన్ మదీనాకు రావడానికి ముందే అనుచరులు రిజ్వానుల్లాహ్‌కు ఇలా తెలిపారు. అబూసుఫ్యాన్ మీ వద్దకు వస్తున్నాడు. నూతనముగా ఒప్పందం చేసుకుందాము. షరతులను పెంచుకుందాము అని అంటాడు. కాని అతడు అసంతృప్తితో తిరిగి వెళ్ళిపోతాడు. అతడి ఏ విషయాన్ని కూడ పట్టించుకోవడం జరుగదు.

మరొక కథనములో ఈ విధముగా గలదు. హారిస్ బిన్ హష్షామ్ మరియు అబ్దుల్లాహ్ బిన్ అబీ రబిఅలు అబూసుఫ్యాన్ వద్దకు వెళ్ళారు. అతనితో వారు ఈ విషయంలో సంధి కుదుర్చుకోవడం కష్టంగా ఉంది. ఒకవేళ ఈ విషయం ఇక్కడితో ముగిసిపోనిచో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ అనుచరులతో కలిసి మీపై దాడి చేస్తారు అని అన్నారు. అందుకు అబూసుఫ్యాన్ మరియు అతని బానిస ఇద్దరు రెండు ఒంటెలపై బయలుదేరినారు. త్వరత్వరగా ప్రయాణించి మదీనాకు చేరుకున్నారు. అతడు ముందుగా తన కుమార్తే మరియు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం శ్రీమతి గారైన ఉమ్మే హబీబా రజి వద్దకు వచ్చాడు. అబూ సుఫ్యాన్ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూర్చునే వస్త్రంపై కూర్చోవడానికి ప్రయత్నించాడు. కాని హజ్రత్ ఉమ్మే హబీబా రజి గారు ఆ వస్త్రాన్ని చుట్టి ప్రక్కన పెట్టారు. అబూసుఫ్యాన్ ఓ నా కుమార్తే! ఆ వస్త్రము నాకు సమానమైనది కదా? లేక నేను ఆ వస్త్రానికి అర్హుడిని కానా? అని అడిగాడు. అందుకు హజ్రత్ ఉమ్మే హబీబా రజి ఇది దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూర్చునే వస్త్రం. నీవు ఒక అన్యారాధుడివి. అపవిత్రుడవు. నీవు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూర్చునే చోట కూర్చోవడం నాకు ఇష్టం లేదు. అతడు ఇలా అన్నాడు. ఓ నా కుమార్తే! అబూసుఫ్యాన్ ఇలా అన్నాడు. ఓనా కుమార్తే! నా నుండి దూరమైన తరువాత నిన్ను చెడు ఆవహించింది. అందుకు ఉమ్మే హబీబా రజి కాదు. అల్లాహ్ తాలా నాకు ఇస్లాం వైపు మార్గదర్శకం చేశాడు. ఓ నా తండ్రి! నీవు ఖురైష్‌ల పెద్దవాడివి, నాయకుడివి. నీవు ఇస్లాంను స్వీకరించడంలో ఎందుకు ఆలస్యం చేశావు?. వారు అతనికి ప్రచారం చేశారు. నీవు విగ్రహాలను పూజిస్తావు. అవి వినలేవు, చూడలేవు. అబూసుఫ్యాన్ అక్కడి నుండి బయలుదేరి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకున్నాడు. ప్రవక్త (స) ఆ సమయంలో మస్జిద్‌లో ఉన్నారు. అతడు ఇలా అన్నాడు. ఓ ముహమ్మద్ ! (సల్లల్లాహు అలైహి వసల్లం) హుదేబియా ఒప్పంద సమయంలో నేను లేను. కావున మీరు ఆ ఒప్పందాన్ని మరల చేయండి. మా కొరకు సమయాన్ని పెంచండి. ప్రవక్త (స) " అబూ సుఫ్యాన్! నీవు ఇందుకోసమే వచ్చావా?" అని అడిగారు. అతడు అవును అని సమాధానం ఇచ్చాడు. ఈ విషయంలో నీతో ఎవరైనా చర్చించారా? అని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరల అడిగారు. అందుకు అతడు అల్లాహ్ ప్రమాణం! మేము మా హుదేబియా ఒప్పందానికి కట్టుబడి ఉన్నాము. అతడు అబద్ధం పలికాడు. మేము అందులో ఎలాంటి మార్పులు చేర్పులు చేయలేదు. మాతో ఒప్పందం జరిగింది. సరే మంచిదే. మేము ఎలాంటి మార్పులు చేర్పులు చేయలేదు. అబూ సుఫ్యాన్ తన మాటను పదే పదే తిరిగి మాట్లాడసాగాడు. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతనికి ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అతడు హజ్రత్ అబూబకర్ రజి వద్దకు వెళ్ళాడు. మీరు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో మాట్లాడండి. లేదా మీ వైపు నుండి ప్రజలకు అభయాన్ని ప్రకటించండి అని వారితో విన్నవించుకున్నాడు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి అతనితో నేనే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అభయంలో ఉన్నాను అని అన్నారు. అప్పుడు అతడు హజ్రత్ ఉమర్ రజి వద్దకు వెళ్ళాడు. హజ్రత్ అబూబకర్ రజితో సంభాషణలు కొనసాగినట్లుగానే సంభాషణలు కొనసాగాయి. అతడు మరల హజ్రత్ ఉస్మాన్ రజి వద్దకు వెళ్ళాడు. వారితో ఇలా అన్నాడు. ప్రజలలో మీ కంటే ఎక్కువ సత్సంబంధాలను కొనసాగించు వారు ఎవరు లేరు. కావున సంధి వ్యవధిని పెంచండి. ఒప్పందాన్ని మరల చేసుకోండి. మీ మిత్రుడు మీ మాటను కాదనలేడు. అందుకు వారు కూడ నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అభయంలోనే ఉన్నాను అని అన్నారు. అప్పుడు అతడు నిరాశతో హజ్రత్ అలీ రజి వద్దకు వెళ్ళాడు. వారితో ఇలా అన్నాడు. ఓ అలీ! నీవు బంధువు పరంగా నాకు చాలా దగ్గరివాడివి. నేను ఒక ముఖ్యమైన పనిమీద వచ్చాను. కాని ఖాళీ చేతులతో తిరిగి వెళ్ళడం నాకు ఇష్టం లేదు. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధిలో నా పక్షమున మాట్లాడుము. వారు ఇలా అన్నారు. అబూ సుఫ్యాన్. నీవు నాశించి పోవుదువు గాకా!. హజ్రత్ అలీ రజి సమాధానం ఇచ్చారు. నీవు నాశనమైపోవుదువు గాకా!. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏదేని విషయంలో ఒక నిర్ణయం తీసుకున్న తరువాత ఆ విషయాన్ని గూర్చి మరల ప్రవక్త (స)తో మాట్లాడడానికి మాకు అవకాశం ఉండదు. పైగా మాకంటూ ఏ అర్హత లేదు. అతడు మరల అలీ రజితో ఇలా అన్నాడు. ఓ అలీ! సమస్యలు నాపై చాలా భారంగా ఉన్నాయి. నాకు ఏదైన సలహా ఇవ్వుము. హజ్రత్ అలీ రజి ఇలా అన్నారు. అల్లాహు ప్రమాణం! నా అంచనా ప్రకారంగా ఇప్పుడు నీకు ఏది కూడ ఎలాంటి ప్రయోజనాన్ని చూకూర్చదు. కాని నీవు కినాన తెగ నాయకుడివి. కావున నిలబడి ప్రజల మధ్య అభయాన్ని గూర్చి ప్రకటించుము. ఆ తరువాత నీవు నీ నగరానికి తిరిగి వెళ్ళిపొమ్ము. అబూసుఫ్యాన్ మస్జిదే నబ్వీవద్దకు వెళ్ళాడు. ఆపై ఇలా అన్నాడు. ఓ ప్రజలారా! నేను ప్రజలలో అభయాన్ని గూర్చి ప్రకటిస్తున్నాను. నా ఈ అభయాన్ని మీరు ఖండించరని నేను భావిస్తున్నాను. ఆ తరువాత అతడు దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకున్నాడు. ఇలా అన్నాడు. ఓ ముహమ్మద్ (స)! నేను ప్రజల మధ్య అభయాన్ని గూర్చిన ప్రకటన చేశాను. అందుకు ప్రవక్త (స) ఇలా అన్నారు. ఓ అబూ హంజలా! నీవే అలా ప్రకటించావు. అనగా మేము దీనిని గూర్చి ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇది నీ ఒక్కడి ప్రకటన. అందుకు అతడు తన ఒంటెపై స్వారి చేస్తూ తిరిగి వెళ్ళిపోయాడు. **(సుబూలుల్ హుదా సంపుటి 5, పేజి 205-207, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

మరొక కథనములో ఈ విధముగా గలదు. హజ్రత్ ఫాతిమా రజితో కూడ ఈ విషయంను గూర్చి సిఫారిస్సు చేయమని కోరడం జరిగింది. కాని వారు కూడ తిరస్కరించారు. **(సీరత్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ప్రొఫేసర్ డాక్టర్ అబ్దుల్ అజీజ్ బిన్ ఇబ్రాహీముల్ అమ్రీ. పేజి 392, దారుస్సలాం)**

అలా అబూసుఫ్యాన్ ఎలాంటి నూతన ఒప్పందం, ప్రామాణికం, ఏకాభిప్రాయం కూదుర్చుకోకుండానే నిరాశ, నిస్పృహలతో తిరుగు ప్రయాణం ప్రారంభించాడు. అబూసుఫ్యాన్ తన జాతి ప్రజల వద్దకు తిరిగి వచ్చిన తరువాత జరిగిన విషయాలన్నింటిని వారికి తెలియజేశారు. కనీసం నీవు ఒక్క మంచి పని కూడ చేయలేక పోయావు కదా! అని వారందరు అబూసుఫ్యాన్‌ను తిట్టారు.

**(ఖాతమున్నబియ్యీన్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 3, పేజి 1190, అబూ జౌహరతు, దారుత్తరాసు బీరూట్)**

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజికూడ చారిత్రక ఆధారాలతో ఈ విషయాన్ని ప్రస్తావించారు. మక్కావారు అబూసుఫ్యాన్‌ను మదీనాకు పంపారు. తద్వారా ముసల్మానులను ఏదో ఒక విధముగా దాడి చేయకుండా అపాలని చూశారు. అబూ సుఫ్యాన్ మదీనా చేరుకున్న తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై ఒత్తిడి తీసుకరావడానికి ప్రయత్నించాడు. హుదేబియా ఒప్పంద సమయంలో నేను లేను. కావున మరల నూతనంగా ఒప్పందం చేసుకుందాము. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతని ఏ మాటకు ఎలాంటి సమాధానంను ఇవ్వలేదు. ఎందుకనగా సమాధానం ఇవ్వడం వలన తమ సంకల్పం బయట పడుతుంది. అందువలన అబూసుఫ్యాన్ నిరాశకు గురై ఆందోళన చెందుతూ మస్జిద్ ప్రాంగణంలో నిలబడి ఇలా ప్రకటన చేశాడు. ఓ ప్రజలారా! నేను మక్కా వారి తరుపున నూతనంగా మీ కొరకు అభయపు ప్రకటన చేస్తున్నాను. ఈ ప్రకటనను విన్న తరువాత ముసల్మానులు అతడి మూర్ఖత్వపు పనికి నవ్వుకున్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు కూడ ఇలా అన్నారు. ఓ అబూసుఫ్యాన్! ఈ ప్రకటనను నీవు నీ వైపు నుండి చేస్తున్నావు. మా నుండి నీవు ఇందుకు ఎలాంటి సంధి చేసుకోలేదు.

**(దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పేజి 337)**

మన రిసర్చ్ సెల్ వారు ఈ అంశంను గూర్చి ఒక నోట్‌ను వ్రాసి పంపారు. నేను హుదేబియా ఒప్పంద సమయంలో లేను అని అబూసుఫ్యాన్ చెప్పడం. సందర్భమేనా లేక కొందరు కావాలనే వ్రాసారా? అనే విషయాన్ని వారు లేవనెత్తారు. సాధారణ ప్రజలకు దీని అవసరం ఏ మాత్రం లేదు. కాని చారిత్రక సంఘటనలను నీగూఢతతో అధ్యాయణం చేసేవారు బహుశా ఈ ప్రశ్న అడుగవచ్చును. నేను అక్కడ లేను అని చెప్పడం సందర్భమేనా?. ఎందుకనగా చారిత్రక గ్రంథాలు మరియు జీవిత చరిత్ర పుస్తకాలలో ఆ సమయంలో అనగా మదీనాకు చేరుకున్న తరువాత అబూసుఫ్యాన్ హుదేబియా ఒప్పంద సమయంలో నేను లేను అని అబూసుఫ్యాన్ అన్నట్లుగా ఉన్నది. కాని అధిక గ్రంథాలు ఈ విషయాన్ని ప్రస్తావించలేదు. చరిత్రకారులలో అధికులు కూడ అబూసుఫ్యాన్ పలికిన ఆ మాటను గూర్చి ప్రస్తావించలేదు.

ఇక మూడవ విషయానికి వచ్చినచో హుదేబియా ఒప్పంద సమయంలో నిజంగా అబూసుఫ్యాన్ అక్కడ లేడా? అని చూడడం. వాఖ్దీ రచించిన కితాబుల్ ముఘాజిలో , సీరత్ హలబియాలో మరియు మరికొన్ని ఇతర గ్రంథాలలో అతడు ఆ సమయంలో అక్కడ లేడని పేర్కొనడం జరిగింది. కాని చారిత్రక మరియు జీవిత గ్రంథాలలో అధికులు ఇలా పేర్కొన్నారు. హుదేబియా ఒప్పంద సమయంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఉస్మాన్ రజిను మక్కాకు పంపించారు. తద్వారా మేము యుద్ధం చేయడానికి రాలేదని అబూసుఫ్యాన్ మరియు ఇతర ఖురైష్‌ల నాయకులకు సందేశం అందించవచ్చును. దీని ద్వార తెలియునదేమనగా అబూసుఫ్యాన్ ఆ సమయంలో అక్కడ ఉన్నాడు. కాని ఇక్కడ శ్రద్ధ చూపించవలసిన విషయమేమనగా హుదేబియా సందర్భములో అతడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో సంభాషించుటకు రాలేదు. ఒప్పందం చేసుకోవడానికి కూడ రాలేదు. నిజానికి అతడు కూడ ఖురైష్‌ల నాయకులలో ఒకడు. ఆ ఒప్పందంలో అతని సంతకం గాని, సాక్ష్యం గాని లేదు. అందుకే అతడు మదీనాలో నేను హుదేబియా ఒప్పంద సమయంలో అక్కడ లేను అని చెప్పడంలో అతడు ఒప్పంద సమయంలో అక్కడ లేడా? లేక నిజానికి అక్కడ లేడా అనేదియే కీలకం. అది కూడ మదీనాకు వచ్చి చెప్పాడు. కావున ఈ విషయాన్నే అతడు మరల చెప్పి ఉండవచ్చును. ఎందుకనగా తన సంతకం లేదు కావున.

మొత్తానికి నేను తెల్పినట్లుగా ఇది రిసర్చ్ సెల్ వారి ఆలోచనలు. కాని వారు ప్రస్తావించుతున్న ఈ వివరాలలోనే వారు తమ అభిప్రాయాలనుకూడ ఖండిస్తున్నారు. అనగా అతడు ఒప్పంద సమయంలో పాల్గొనలేదు అనే మాటతో. ఎందుకనగా అతడు నాయకుడైనప్పటికి ఒప్పందంలో అతని సంతకం లేదు. వీరు ఈ విషయాన్ని వ్రాస్తున్నారు. అందుకే అబూసుఫ్యాన్ ఈ విషయాన్ని ఆధారం చేసుకోని ఉండవచ్చును. అందుకే అతడు మదీనాకు వచ్చి నేను ఒప్పంద సమయంలో అక్కడ లేను అని చెప్పినందున ఎలాంటి అనుమానంనకు గురి కావలసిన అవసరం లేదు. అతడు సరిగ్గనే మాట్లాడినాడు. అం పాల్గొనలేదు, అక్కడ లేడు అనే పదాలలో బహుశా కథకుడికి పొరపాటు తగిలి ఉండవచ్చును. కాని ఘటనలు మాత్రం ఆ విషయాన్ని ఎక్కువ సరిగ్గా తెల్పుతుంటాయి. అనగా అతడు ఒప్పందంలో పాల్గొనలేదని ప్రకటించాడు. ఈ విషయమే మన ముందుకు వస్తుంది. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు కూడ ఈ విషయాన్ని పేర్కొన్నారు. అనగా అతడు ఇలా అన్నాడు. దానిని వారు రజి స్వీకరించారు. అతడు ఒప్పందంలో పాల్గొనలేదు అనే విషయమే ఎక్కువ సరైనదిగా కనిపిస్తుంది. దీని ద్వారా అతడు అక్కడ లేడు అనే విషయాన్నే మనం అర్థం చేసుకోగలము. మొత్తానికి ఇది ఒక చారిత్రాత్మక సమస్య. దీనిని నేను ఇక్కడ ప్రస్తావించాను. అందుకే ఇందులో ఎలాంటి అనుమానంనకు చోటు లేదు. ఎలాంటి ప్రశ్న కూడ తలెత్తదు. ఇక్కడ చాలా స్పష్టముగా పేర్కొనడం జరిగింది.

మొత్తానికి ఈ యుద్ధానికి బయలుదేరునట్టి వివరాలను గూర్చి ఇలా పేర్కొన్నారు. అం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చాలా గోప్యముగా ప్రయాణానికి సంబంధించిన ఏర్పాట్లు ప్రారంభించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలను కూడ ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకొమ్మని ఆదేశించారు. కాని ఎక్కడి వెళ్ళుతున్నాము అనే విషయాన్ని ఎవరికి తెలియజేయలేదు. అదే విధముగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఆయిషా రజి తో కూడ ప్రయాణానికి నా సామాగ్రిని సిద్ధము చేయమని ఆదేశించారు. ఇలా ఆదేశించిన తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంటి నుండి బయటికి వెళ్ళారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ రజి తమ కుమార్తె అయినా హజ్రత్ ఆయిషా రజి వద్దకు వచ్చారు. ఆ సమయంలో హజ్రత్ ఆయిషా రజి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు సామాగ్రిని సిద్ధం చేస్తున్నారు. హజ్రత్ అబూబకర్ రజి " దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏదేని యుద్ధం కొరకు బయలుదేరుతున్నారా? " అని వారిని అడిగారు. అందుకు హజ్రత్ ఆయిషా రజి మౌనంగానే ఉండిపోయారు. ఆ తరువాత హజ్రత్ అబూబకర్ రజి " బహుశా రోమన్‌ల వైపు ప్రయాణించ వచ్చును లేదా బహుశా నజద్ వైపు ప్రయాణించవచ్చును లేదా బహుశా ఖురైష్‌ల వైపు ప్రయాణించ వచ్చును .కాని ఖురైష్‌లతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇంకా వ్యవధి ఉన్నది కదా? అని " మరల అడిగారు. అప్పుడు హజ్రత్ ఆయిషా రజి ప్రతి ప్రశ్నకు మౌనంగా ఉండిపోయారు. ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అంతలోనే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వచ్చారు. కావున హజ్రత్ అబూబకర్ రజి " ఓ దైవ ప్రవక్తా! ఎక్కడికైనా ప్రయాణిస్తున్నారా?" అని అడిగారు. అందుకు ప్రవక్త (స) అవును అని సమాధానం ఇచ్చారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ రజి మీరు బనూ అసఫర్ వైపు అనగా రోమన్‌ల వైపు ప్రయాణించబోతున్నారా? అని అడిగారు. అందుకు ప్రవక్త (స) కాదు అని సమాధానం ఇచ్చారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ రజి మీరు నజద్ ప్రజల వైపు ప్రయాణించబోతున్నారా? అని అడిగారు. అందుకు ప్రవక్త (స) కాదని సమాధానం ఇచ్చారు. మూడవసారి హజ్రత్ అబూబకర్ రజి బహుశా మీరు ఖురైష్‌ల వైపు ప్రయాణించాలనుకుంటున్నారా? అని అడిగారు. అందుకు ప్రవక్త (స) అవును అని సమాధానం ఇచ్చారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ రజి " మీకు మరియు వారికి మధ్య ఒక ఒప్పందం ఉన్నది కదా? అని అడిగారు. అనగా హుదేబియా ఒప్పందం. అందుకు ప్రవక్త (స) " వారు బనూ కఅబ్ అనగా ఖుజాఅ తెగవారిని ఏమి చేశారో ఇంకా నీకు తెలియలేదా? అని " అన్నారు.

**(ముఘాజి, సయ్యదినా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మూసా బిన్ ఉక్బా, సంపుటి 3, పేజి 119-121)**

ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు సీరత్ హలబియ్యాలో వివరముగా పొందుపర్చబడ్డాయి. హజ్రత్ అబూబకర్ రజి ప్రవక్త (స)ను "మీరు ప్రయాణించాలనుకుంటున్నారా? అని" అడిగారు. అందుకు ప్రవక్త (స) అవును అని సమాధానం ఇచ్చారు. హజ్రత్ అబూబకర్ రజి మరల " అలాగైనచో నేను కూడ ఏర్పాటు చేసుకోనా?" అని అడిగారు. అందుకు ప్రవక్త (స) చేసుకొనుము అని సమాధానం ఇచ్చారు. హజ్రత్ అబూబకర్ రజి మరల " ఓ దైవ ప్రవక్త (స)! మీరు ఎక్కడికి ప్రయాణించాలని అనుకుంటున్నారు? అని" అడిగారు. అందుకు ప్రవక్త (స) ఖురైష్‌లను ఎదురించుటకు అని సమాధానం ఇచ్చారు. ఆపై మరల వెంటనే " అబూబకర్ ఈ విషయాన్ని ప్రస్తుతం రహస్యముగానే ఉండనీయుము " అని అన్నారు. మొత్తానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలను కూడ ఏర్పాట్లు చేసుకొమ్మని ఆదేశించారు. కాని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎక్కడికి వెళ్ళాలి అని అనుకుంటున్నారో ఆ విషయాన్ని మాత్రం ప్రజలకు తెలియకుండా జాగ్రత పడ్డారు. ఆ తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టు ప్రక్కల ఉన్నటు వంటి గ్రామీణ ప్రాంతాల ముసల్మానులకు కూడ సందేశాన్ని అనగా అల్లాహ్ మరియు ప్రళయ దినమును విశ్వసించువారు రమజాన్ మాసంలో మదీనాకు చేరుకోండి అని పంపించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రకటను అనుసరించి అరబ్‌కు చెందిన తెగలు మదీనాకు చేరుకోవడం ప్రారంభించాయి. మదీనాకు చేరుకున్న తెగలలో బనూ అస్లం, బనూ ఘఫ్ఫార్, బనూ మజీన, బనూ అష్‌జఅ మరియు బనూ జుహైనాలు ఉన్నాయి.

**(సీరతుల్ హలబియ్యా సంపుటి 3, పేజి 107-108, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

మరొక కథనము ప్రకారంగా చూసినచో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ముందుగా హజ్రత్ అబూబకర్ రజిను పిలిపించుకోని సంప్రదింపులు జరిపారు. ఆ తరువాత హజ్రత్ ఉమర్ రజిను పిలిపించుకోని సంప్రదింపులు జరిపారు. ఆ తరువాత ముసల్మానులందరిని ప్రయాణానికి సిద్ధం కమ్మని ఆదేశించారు అని గలదు. **(సుబూలుల్ హుదా సంపుటి 5, పేజి 208, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

ఈ ఘటనను గూర్చి తెలియజేస్తూ హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా పేర్కొన్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఒక శ్రీమతితో నా ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చేయడం ప్రారంభించుము అని అన్నారు. వారు రజి ప్రయాణ సామాగ్రిని సిద్ధం చేయడం ప్రారంభించారు. ఆపై ప్రవక్త (స) హజ్రత్ ఆయిషా రజితో నా కోసం సత్తుపిండి లేదా శెనిగలను వేయించి సిద్ధం చేయుము అని అన్నారు. ఆ రోజులలో ఇలాంటి పిండి పదార్థాలను భోజనంగా సిద్ధం చేసేవారు. కావున వారు శెనిగలలో ఉన్నటు వంటి మట్టిపెళ్ళలు మరియు చిన్న రాళ్ళను వేరుచేస్తూ గింజలను శుభ్రం చేయసాగారు. ఆ క్రమంలోనే హజ్రత్ అబూబకర్ రజి తమ కుమార్తె ఇంటికి వచ్చారు. వారు ఈ ఏర్పాట్లను చూసి " ఆయిషా రజి మీరు ఏమి చేస్తున్నారు?. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏదేని ప్రయాణానికి బయలుదేరుతున్నారా?" అని అడిగారు. అందుకు వారు ప్రయాణానికి సంబంధించియే ఏర్పాట్లు జరుగుతున్నాయి అని అన్నారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రయాణ ఏర్పాట్లు చేయమని సూచించారు. అప్పుడు

హ॥జ్రత్ అబూబకర్ రజి " ఏదేని యుద్ధానికి బయలుదేరుతున్నారా? అని అడిగారు. అందుకు హ॥జ్రత్ ఆయిషా రజి " నాకు ఆ విషయం తెలియదు. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నా ప్రయాణానికి తగిన ఏర్పాట్లు చేయమని అన్నారు. కావున మేము ఆ ఏర్పాట్లు చేస్తున్నాము " అని సమాధానం ఇచ్చారు. హ॥జ్రత్ ఆయిషా రజి ఈ విధముగా సమాధానం ఇచ్చారు. మేము సామాగ్రిని ఏర్పాటు చేస్తున్నాము. కాని ఎక్కడి వెళ్ళుతున్నారు? ఎందుకు వెళ్ళుతున్నారు? అనే విషయం గురించి మాకు ఏమియు తెలియదు. రెండు మూడు రోజుల తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హ॥జ్రత్ అబూబకర్ రజి మరియు హ॥జ్రత్ ఉమర్ రజిలను పిలిపించారు. ఆపై వారితో " ఖుజాఅ తెగకు చెందిన కొందరు వ్యక్తులు నా వద్దకు వచ్చారు. ఇలా ఇలా జరిగిందని వారు తెలియజేశారు. వారు ద్రోహానికి పాల్పడ్డారనే విషయాన్ని ఈ ఘటనకు ముందే అల్లాహ్ తాలా నాకు తెలియజేశాడు. మనం వారితో ఒప్పందం చేసుకున్నాము కూడ. మనం భయపడడం మరియు మక్కా వారి ధైర్యాన్ని, బలాన్ని చూసి మనం వారిని ఎదురించడానికి వెళ్ళక పోవడం అనేది విశ్వాసానికి వ్యతిరేకం. ఏది ఏమైన మనం అక్కడికి వెళ్ళాలి. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగారు. అందుకు హ॥జ్రత్ అబూబకర్ రజి " ఓ దైవ ప్రవక్తా (స)! మీరు వారితో ఒప్పందం చేసుకున్నారు. పైగా వారు మీ జాతికి చెందినవారు " అని అన్నారు. అర్థమేమనగా మీరు మీ జాతి ప్రజలను చంపుతారా?. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం " మనం మన జాతి వారిని చంపడం లేదు. ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడిన వారినే చంపుతాం " అని చెప్పారు. ఆ తరువాత హ॥జ్రత్ ఉమర్ రజిను అడిగారు. హ॥జ్రత్ ఉమర్ రజి గారిది, విభిన్న వ్యక్తిత్వం. వారు ఇలా అన్నారు. బిస్మిల్లాహ్. ఇలాంటి రోజు ఒకటి రావాలని, మేము దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను రక్షించు క్రమంలో అన్యారాధులతో పోరాడాలని నేను ప్రతిరోజు దుఆ చేస్తున్నాను. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. అబూబకర్ చాలా మృదు స్వభావం కల్గినవారు. కాని సత్యవాక్కు ఉమర్ నోటి నుండి వెలువడుతుంది. అనగా ఉమర్ సరైన సలహా ఇచ్చారు. ఆపై ఇలా అన్నారు. వెళ్ళి ఏర్పాట్లు చేసుకోండి. ఆ తరువాత ప్రవక్త (స) చుట్టు ప్రక్కల ఉన్నటు వంటి తెగల వారికి " అల్లాహ్ మరియు అతని ప్రవక్తను విశ్వసించువారందరు రమజాన్ మాసపు ప్రారంభపు రోజులలో మదీనాలో ఏకం కావాలని " సందేశాత్మక ప్రకటనను పంపించారు.

**(సేరే రూహానీ, (7) అన్వారుల్ ఉలూమ్, సంపుటి 24, పేజి 260-261)**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ప్రయాణంను రహస్యముగా ఉంచడం కోసం అనేక వ్యూహ్యాలను అమలు చేశారు. ఈ క్రమంలోనే ప్రవక్త (స) ప్రయాణానికి ముందు 8 మందితో కూడిన ఒక బృందాన్ని హ॥జ్రత్ అబూ ఖతాదహ్ బిన్ రిబుఇ రజి నాయకత్వంలో ఇజం లోయవైపు మక్కాకు భిన్నముగా పంపారు. తద్వారా ప్రవక్త (స) అటు వైపు ప్రయాణం చేయబోతున్నారని అంచనాలు వేసే వారు అంచనాలు వేయవచ్చును. ఫలితముగా అసలు ప్రయాణం గురించి ఎవరికి తెలియకుండా దాచవచ్చును. ఈ ఇజం అనే లోతట్టు ప్రాంతం మదీనా నుండి 36 మైళ్ళ దూరంలో తూర్పు దిశలో నజద్ ప్రాంతంలో ఉంటుంది.

**(సీరత్ ఇన్‌సైక్లోపీడియా సంపుటి 9, పేజి 111, దారుస్సలాం)(ఫ్రాంగ్ సీరత్ పేజి 45, జవార్ అకాడమి కరాచి)**

అంతేగాకుండా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మదీనా చుట్టు ప్రక్కల ప్రాంతాలకు కొంత మందిని పంపారు. వారి విధి ఏమిటనగా ఎవరైన అపరిచిత వ్యక్తి మక్కావైపు వెళ్ళుచున్నచో వారిని వెనుకకు తీసుకవచ్చి ప్రవక్త (స) ముందు నిలబెట్టడం. ఈ పనులన్నింటిని పర్యవేక్షించడం కోసం ప్రవక్త (స) హ॥జ్రత్ ఉమర్ రజిను నియమించారు. ఒక పర్యవేక్షణాధికారిగా వారు పర్యటిస్తూ ఉండేవారు. ఈ వ్యూహాలన్ని ఏర్పాటు చేసిన తరువాత కూడ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఆరాధ్యదైవమైన అల్లాహ్ సన్నిధిలో చేతులు ఎత్తి దుఆలు చేస్తూండేవారు.

**అల్లాహుమ్మ ఖుజ్ అలా అస్‌మా ఇహిం వ అబ్‌సారి హిం ఫలా యరవ్‌నా ఇల్లా బఘ్‌తతన్ వలా యస్‌మఉన బినా ఇల్లా ఫజ్‌అతన్ .**

ఓ అల్లాహ్! ఖురైష్‌ల చెవులను, కన్నులను అడ్డుకొనుము. అనగా వారి గూడచారులు, సమాచార సేకరులు మమ్ములను చూడకుండా అడ్డుకొనుము. కాని మేము అకస్మత్తుగా వారి వరకు చేరుకొనవలెను. వారు మాకు చెందిన ఏ సమాచారాన్ని సేకరించకుండా చూడుము. కాని మేము అకస్మత్తుగా వారి వద్దకు చేరునట్టి సమాచారంను అందించుము.

**(సీరతున్నబి సల్లల్లాహు అలైహి వసల్లం డాక్టర్ సలాబీ, అనువాదం సంపుటి 3, పేజి 384-385)(దాయిరే మాఆరిఫ్ సంపుటి 9, పేజి 72, బజమే ఇక్బాల్ లాహోర్)**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చేసిన మరొక దుఆ కూడ గలదు. ఆ దుఆ ఇలా గలదు.

**అల్లాహుమ్మ ఖుజిల్ ఉయూన వల్ అఖ్‌బార అన్ ఖురైషిన్ హత్తా నబ్‌ఘతహా ఫీ బిలాదిహా**

ఓ అల్లాహ్! ఖురైష్‌కు చెందిన గూడచారులను, వార్త సేకరులను మేము వారి ప్రాంతానికి అకస్మత్తుగా చేరుకునే వరకు అడ్డుకొనుము.

**(తారీఖే తిబ్రీ, సంపుటి 2, పేజి 155, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

ఆ తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రయాణాన్ని ప్రారంభించారు. మిగిలిన వివరాలను ఇన్షా అల్లాహ్ తరువాత ప్రస్తావించుతాను.

ఇప్పుడు నేను ప్రాపంచిక పరిస్థితులను గూర్చి మాట్లాడాలనుకుంటున్నాను. దుఆలు చేయండి అని పదే పదే తెల్పుతుంటాను.

యుద్ధం వ్యాపించే అవకాశాలు పెరుగుతూనే ఉన్నాయి. అల్లాహ్ తాలా ఈ వినాశనం నుండి మనలను సురక్షితముగా కాపాడమని అల్లాహ్ తాలాతో దుఆలు చేయండి. ఎందుకనగా ఇప్పుడు ఈరాన్‌పై కూడ ఇజ్రాయిల్ దాడి చేస్తుంది. ఈ యుద్ధం చాలా భయానక స్థితిలోకి మారిపోతుంది. ఇజ్రాయిల్ దేశ ప్రజలు ప్రస్తుతం ఒక్కొక్కటిగా ముస్లిం దేశాలన్నింటిని నాశనం చేయాలని చేస్తున్నారు. కాని ముస్లిం దేశస్థులు నిద్రపోతున్నారు. తమ అభివృద్ధి మరియు తమ ఇతర అవసరాలకు ప్రాధాన్యత నిస్తూ వాటి సాధనలోనే నిమగ్నమైపోయారు. ఏం జరుగుతుందో వారికి అర్థం కావడం లేదు. ముసల్మానుల నడవడిక సరిగ్గా లేదు. వారికి దుఆ వైపు శ్రద్ధ కూడ కలుగడం లేదు. ఇలాంటి పరిస్థితులలో కలిగే నష్టాన్ని గురించి ఎవరు కూడ అంచనా వేయలేరు.

అల్లాహ్ తాలా వారికి వివేకాన్ని ప్రసాదించుగాకా! ఇటు వైపు శ్రద్ధ కల్గు గాకా! తమ ఐక్యతను ఏర్పర్చుకోనుటకు ప్రయత్నించుదురు గాకా!.అంతేగాని వారు ఫలాన వర్గానికి చెందినవారు, వీరు ఫలాన వర్గానికి చెందనవారు కావున మేము వారికి సహాయం అందించము అని చూడకూడదు. అన్ని దేశాలు ఆపదలోనే ఉన్నాయి. ఎందుకనగా అల్ కుఫ్రు మిల్లతున్ వాహిద గా ఏర్పడింది. అవిశ్వాసులందరు ఒకే జాతిగా ఏర్పడినారు. కావున ముసల్మానులు కూడ ఒకే సమాజంగా మారవలసి అవసరం ఉన్నది. అప్పుడే వారు కాపాడబడుతారు. లేనిచో ఎలాంటి ప్రయోజనం లేదు.

అల్లాహ్ తాలా అమాయకులందరిని, పీడితులందరిని కాపాడును గాకా! మనం దుఆల వైపు ఎక్కువగా శ్రద్ధను చూపవలెను. అల్లాహ్ తాలా ఇట్టి భాగ్యమును మనకు కల్పించుగాకా!.

---

**(1వ పేజి తరువాత)** అయినా కూడ అతడు నేను అట్టి ఫలాన వస్తువును పట్టుకోలేదని చెబుతాడు. దీని అర్థమేమనగా అతడు తన చేతులకు మీరు ఆ వస్తువును పట్టుకోలేదని నేర్పుతున్నాడు. అతని నాలుక ఏదేని రుచి చూసినచో, అతడు మాత్రం నేను ఫలాన రుచి చూడలేదని పలుకుతాడు. దీని అర్థం అతడు అతని నాలుకకు నీవు ఫలాన రుచి చేడలేదని నేర్పుతున్నాడు. అతని చెవులు ఏదేని విషయాన్ని విన్నచో, అతడు వినలేదని తిరస్కరిస్తాడు. దీని అర్థం అతడు తన చెవులకు నీవు ఫలాన విషయం వినలేదు అని నేర్పుతున్నాడు. ఇది ఎంతటి హాస్యస్పదం, ఎంతటి విచిత్రమో చూడండి. అయినా కూడ ప్రజలు దీనిని గూర్చి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సమయం రాగానే అబద్ధం ఆడుతుంటారు. **(తఫ్సీరే కబీర్, సంపుటి 4, పేజి 580-583, ప్రచురణ ఖాదియాన్ 2010)**

**130 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్**

సయ్యద్నా హ॥జ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 130 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 26,27,28 డిశంబర్ 2025 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాకా! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక! **(నాజిర్ ఇస్లాహి విర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్)**

# జుమా ప్రసంగము

**నేటి రోజులలో సర్వసాధారణముగా సామాజిక మాధ్యమాలతో ప్రయోజనం చేకూరుతుంది. కావున వాటి నుండి ప్రయోజనాన్ని పొందుతూ ఉంటారు. అదే సమయంలో కొన్ని ఇబ్బందికర ఘటనలు కూడ చోటు చేసుకుంటాయి. ఆయా ఘటనలను ఆధారం చేసుకోని ప్రస్తుత రోజులలో వ్యతిరేకులు అహ్మదియ్య జమాఅత్‌ను గురించి దుర్భషలాడుతుంటారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంపై నిందలు వేయడం, దూషించడం వంటివి చేస్తుంటారు. ఫలితముగా అహ్మదీయుల మనస్సులు గాయపడిపోతాయి.**

---

**మన మనస్సులో కేవలం ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి స్థానమొక్కటే కాదు, ఆ స్థానం మనలో ఉన్నది. ఆ స్థానం వరకు ఎవరు కూడ చేరుకోలేరు. ప్రవక్త (స)తో పాటు సహాబా రిజ్వానుల్లాహ్ అలైహి అజ్మయీన్‌ల పట్ల గల గొప్పస్థానం కూడ ఉన్నది. ఈ విషయాన్ని ప్రతి అహ్మదీయులు ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. ప్రతి అహ్మదీయుడు చెడు ప్రభావం వెలువడే విధమైన మాటల నుండి గాని లేదా చేడు ప్రభావం వెలువడటుకు ఆవకాశం ఉన్నటు వంటి మాటల నుండి కూడ దూరంగా ఉండాలి.**

---

**కావున మనం మన ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రతి ఒక్కరు తమను తాము పరీక్షించుకోవాలి. ఆలోచించండి. తప్పుడు అర్థాలను ఇచ్చే సమాధానాల కంటే దుఆల వైపు మ్రొగ్గు చూపండి. ఇందుకు అల్లాహ్ తాలా మనందరికి అవకాశంను కల్పించుగాకా! వ్యతిరేకుల దుష్టత్వములను వారిపైనే వేయును గాకా! వాటి నుండి కాపాడును గాకా!.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 06 జూన్ 2025, ( 06 ఎహ్సాన్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

నేటి రోజులలో సర్వసాధారణముగా సామాజిక మాధ్యమాలతో ప్రయోజనం చేకూరుతుంది. కావున వాటి నుండి ప్రయోజనాన్ని పొందుతూ ఉంటారు. అదే సమయంలో కొన్ని ఇబ్బందికర ఘటనలు కూడ చోటు చేసుకుంటాయి. ఆయా ఘటనలను ఆధారం చేసుకోని ప్రస్తుత రోజులలో వ్యతిరేకులు అహ్మదియ్య జమాఅత్‌ను గురించి దుర్భషలాడుతుంటారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంపై నిందలు వేయడం, దూషించడం వంటివి చేస్తుంటారు. ఫలితముగా అహ్మదీయుల మనస్సులు గాయపడిపోతాయి. వాటిని విన్న తరువాత, వాటిని ఖండించే క్రమంలో కొంత మంది అహ్మదీయులు సమాధానాలను తప్పుడు పద్ధతిలో ఇస్తుంటారు. వారి సంకల్పం స్వచ్ఛమైనదే అయినప్పటికి కొన్ని సార్లు వారి నోటి నుండి వెలువడే పదాలకు తప్పుడు అర్థాలను ఆపాదిస్తుంటారు. ఇది మన పద్ధతి కాదు. ఇలాంటి వాటి నుండి అహ్మదీయులు దూరంగా ఉండాలి.

దూషించినట్లు మాట్లాడడం మన పని కాదు. అవమానాన్ని కల్గించే ఎలాంటి మాటలు పొరపాటున కూడ మన నోటి నుండి వెలువడకూడదు. అలా వెలువడినచో వాటి నుండి ప్రయోజనాన్ని పొందుతూ మన వ్యతిరేకులు నవూజుబిల్లాహ్ మనం ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను మరియు సహాబా రిజ్వానుల్లాహ్ అజ్మయీన్‌లను అవమానిస్తున్నామని ప్రచారం చేస్తుంటారు. వాస్తవానికి మన మనస్సులో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు సహాబా రిజ్వానుల్లాహ్ అలైహిం అజ్మయీన్‌లకు ఉన్న గౌరవ, మర్యాదలలో కోటివ వంతు అవగాహన వారికి లేదు.

మన సర్వస్వం ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు అంకితం. ప్రవక్త (స)యే ఖాతముల్ అన్బియా, అల్లాహ్ తాలా ప్రియమైన ప్రవక్త. చివరి ప్రవక్త. ప్రవక్త (స)తో పాటు ఉన్నవారిని గూర్చి అనగా సహాబాలను గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారు అనేక చోట మన వ్యతిరేకుల మేథస్సులో లేనంతటి గొప్ప గొప్ప పదాలను పేర్కొన్నారు. గొప్పగొప్పగా వర్ణించారు.


మొత్తానికి మన మనస్సులో కేవలం ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి స్థానమొక్కటే కాదు, ఆ స్థానం మనలో ఉన్నది. ఆ స్థానం వరకు ఎవరు కూడ చేరుకోలేరు. ప్రవక్త (స)తో పాటు సహాబా రిజ్వానుల్లాహ్ అలైహి అజ్మయీన్‌ల పట్ల గల గొప్పస్థానం కూడ ఉన్నది. ఈ విషయాన్ని ప్రతి అహ్మదీయులు ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. ప్రతి అహ్మదీయుడు చెడు ప్రభావం వెలువడే విధమైన మాటల నుండి గాని లేదా చేడు ప్రభావం వెలువడటుకు ఆవకాశం ఉన్నటు వంటి మాటల నుండి కూడ దూరంగా ఉండాలి.

మేము ఇలాంటి సమాధానంను ఇచ్చి చాలా పౌరుషాన్ని చూపించాము అని కొందరు అహ్మదీయులు భావిస్తుంటారు. వారిని ప్రశ్నించినప్పుడు కూడ వారు ఇలాంటి సమాధానమునే ఇస్తారు. వాస్తవానికి ఇలాంటి పేరుమోసిన పౌరషంను మూర్ఖత్వం అంటారు. ఒకవేళ ఎవరైన తనను తాను అహ్మదీయుడిగా భావిస్తూ, ఈ విధముగా మాట్లాడినచో, అతడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మరియు అహ్మదియ్య జమాఅత్‌కు తలవంపులు తెచ్చినవాడగును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా తెలిపారు. మీరు సహనాన్ని పాటించండి. ఎల్లప్పుడు ఓర్పును ప్రదర్శించండి. ఒకచోట హుజూర్ (అ) ఇలా తెలిపారు.

" వారు నన్ను దూషిస్తూంటారు. కాని నాకు వారి దూషణలతో ఎలాంటి పట్టింపు లేదు. వాటిని గూర్చి చింతన కూడ లేదు. ఎందుకనగా వారు ఆధారపూరిత పోటిలో నిస్సహాయులైనారు. కావున వారు తమ నిస్సహాయతను, ఓటమిని దాచుకునే మార్గంలేకయే దూషణలకు పాల్పడుతుంటారు. "

వారు ఇలాంటి నీచమైన, పనికిమాలిన విధానాలను ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారు. అందుకు కారణం వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఏ విధమైన సమాధానాలు లేవు. హుజూర్ (అ) ఇలా తెలిపారు. "అవిశ్వాసపు ఫత్వాలు జారి చేసినా, తప్పుడు వ్యాజ్యాలు మోపినా, రకరకాల ఆరోపణలు, నిందలు అంటగట్టినా, వారు వారికున్న అన్ని రకాల శక్తులను ఉపయోగిస్తూ పోటికి వచ్చినా చివరికి ఎవరి పక్షంలో తీర్పు వస్తుందో చూడండి." ఏ ప్రయత్నం చేయాలను కున్నారో మీరు చేసుకోండి. కాని అల్లాహ్ తాలా నాతో ఉన్నాడు. తుదితీర్పు వెలువడినప్పుడు అతడు ఎవరి పక్షంలో ఉన్నాడో తెలుస్తుంది. మరల ఇలా తెలిపారు. " నేను వారి దూషణలను పట్టించుకుంటూ ఉన్నచో అల్లాహ్ తాలా నాకు

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

అప్పగించినటు వంటి అసలైన పని అలాగే ఉండిపోతుంది. అందుకే నేను వారి దూషణలను గూర్చి ఏ మాత్రం పట్టించుకోను.

నేను నా జమాఅత్‌కు చేయు ఉపదేశమేమనగా, వ్యతిరేకుల దూషణలను విని మౌనంగా ఉండండి. ఎన్నడు కూడ దూషణలకు దూషణలను సమాధానంగా ఇవ్వకూడదు. ఎందుకనగా వాటి వలన శుభములు దూరమైపోతుంటాయి.

మీరు సహనం మరియు ఓర్పుతో కూడిన ఆదర్శంను ప్రదర్శించండి. మీ ఉన్నత సుగుణాలను వ్యక్తపర్చండి.

నిశ్చయముగా గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, వివేకం, ఉద్రేకంలో భయంకరమైన శత్రుత్వం ఉంటుంది. ఎప్పుడైతే ఉద్రేకం, కోపం వస్తుందో అప్పుడు వివేకం, విజ్ఞత కోల్పోబడుతాయి. కాని ఎవరైతే సహనంను పాటిస్తారో, వినమ్రతను ప్రదర్శిస్తారో వారికి ఒక తేజస్సును అందివ్వడం జరుగుతుంది. ఫలితముగా వివేకానికి, ఆలోచనలకు ఒక నూతన తేజస్సుతో కూడిన శక్తి అందుతుంది. అలా ఆ తేజస్సుతో మరొక తేజస్సు ప్రకాశిస్తూనే ఉంటుంది.

కోపం మరియు ఉద్రేక సమయాలలో మనస్సు మరియు మేధస్సు రెండు అంధాకారమైపోతాయి అందుకే అంధాకరంతో అంధాకరమే వ్యాపిస్తుంది. ”

**(మల్ఫూజాత్ సంపుటి 3, పేజి 180, ఎడిషన్ 1984)**

కావున మనం ఈ పాఠాలను ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. కొందరు స్వయం ప్రతిపాధిత విధ్యావేత్తలుగా భావించేవారు, సామాజిక మాధ్యామాలలో అహ్మదీయేతర పేరుమోసిన ముల్లాల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ప్రారంభిస్తారు. వారు ఆరోపణలు చేసే వారందరికి సమాధానాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తుంటారు. అలాంటి వారు ఇలాంటి పనుల నుండి దూరంగా ఉండాలి. ఒకవేళ సమాధానాలు ఇవ్వాలనుకున్నచో జమాఅత్ ఉలమాల ద్వారా, జమాఅత్ సాహిత్యం ద్వారా తెలుసుకున్న తరువాత ఖచ్చితమైన ఆధారభరితమైన సమాధానాలను వారికి ఇవ్వడానికి ప్రయత్నించాలి. ఆయా సమాధానాలు వారి ఆరోపణలను, వారి నిందనలను ఖండించే విధముగా ఉండాలి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి బోధనలే అసలైన ఇస్లామీయ బోధనలు. కావున వాటికి అనుగుణముగా నడుచుకోవాలి. లేనిచో మీరు జమాఅత్‌లో ఉంటూ జమాఅత్‌కు తలవంపులు తెచ్చిన వారవుతారు.

అల్లాహ్ తాలా మనలను దుష్టుల దుష్టత్వాల నుండి కాపాడుగాకా! తాత్కాలిక పౌరుషంను ప్రదర్శించేవారికి కూడ వివేకాన్ని ప్రసాదించుగాకా! ఇలాంటి వారు కొన్ని సందర్భాలలో కొన్ని పదాలను ఉచ్చరిస్తూ ఆందోళనలను, ఆ శాంతిని వ్యాపింప జేయుటకు కారకులవుతారు.

ఒకవేళ మనం సామాజిక మాధ్యమాలకు బదులుగా అల్లాహ్ తాలా సన్నిధిలో మోకరిల్లినచో, మన నమాజ్‌లను శ్రద్ధతో చదివినచో, అల్లాహ్ పౌరుషం త్వరగా ప్రభావం చూపు విధముగా మనం మన సజ్దాలలో తల్లడిల్లినచో వాటి ద్వార ఇలాంటి వ్యక్తులు సమాధానాల ద్వారా పొందాలనుకునే ప్రయోజనాల కంటే ఎక్కువ ప్రయోజనాలను మనం అతి తొందరగా సాధించినవారము అవుతాము.

అహ్మదీయులు ఇలా అన్నారు, అహ్మదీయులు అలా అన్నారు అని అనవసరంగా వ్యతిరేకులకు అవకాశాన్ని కల్పించే విధముగా ఎలాంటి మాటలు మాట్లాడకూడదనే విషయాన్ని ప్రతి అహ్మదీయుడు తెలుసుకోవాలి, వాటి నుండి దూరంగా ఉండాలి.

మన సుగుణాలు ఉన్నతమైనవిగా ఉండాలి. చాలా గొప్పగా ఉండాలి. ఎవరి సుగుణాలు ఉన్నతముగా ఉండవో వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి బైఅత్ హక్కును నెరవేర్చిన వారు కాజాలరు.

కావున మనం మన ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రతి ఒక్కరు తమను తాము పరీక్షించుకోవాలి. ఆలోచించండి. తప్పుడు అర్థాలను ఇచ్చే సమాధానాల కంటే దుఆల వైపు మ్రొగ్గు చూపండి. ఇందుకు అల్లాహ్ తాలా మనందరికి అవకాశంను కల్పించుగాకా! వ్యతిరేకుల దుష్టత్వములను వారిపైనే వేయును గాకా! వాటి నుండి కాపాడును గాకా!.

**(అల్ ఫజల్ ఇంటర్నేషనల్, 27 జూన్ 2025, పేజి 2-3)**

| **అహ్‌దీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **“ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు.”** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

## హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ఖాతమున్న బియ్యీన్

అనువాదము: ముహమ్మద్ మీ వలె నున్న పురుషులలో ఎవరికి తండ్రి కారు. వారు అల్లాహ్ ప్రవక్త, సందేశహరులనందరిని ధృవపరచునట్టివారు. అల్లాహ్ సర్వజ్ఞుడు.(అల్ అహ్‌జాబ్:41)

ఈ సూక్తి అనుసారము జగత్ ప్రవక్త, హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం నిస్సందేహముగా ఖాతమున్నబియ్యీన్ అని అహ్మదియ్య జమాఅత్ మొత్తం విశ్వాసము. ఈ విషయములో ముస్లిముల ఒక్క వర్గములో కూడ విభేదము రాలేదు, లేదు, భవిష్యత్తులో కూడ రాదు. కాని పరిశోధించవలసిన విషయమమేనగా ఖాతమున్నబియ్యీన్ అర్థము, భావమేమిటి ? ఖత్మె నబువ్వత్ అనగా వరము అంతమగుటనా లేదా లాభము, వరము కొనసాగుటనా ? ఈ శీర్శిక గురించి అభిప్రాయము తెలుపుట నేటి ఉద్దేశము.

గౌ॥ శ్రీ॥ అహ్మదియ్య జమాఅత్ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను హృదయపూర్వకంగా ఖాతమున్నబియ్యీన్ అని విశ్వసించును. ఖత్మె నబువ్వత్ తిరస్కరణ ఆరోపణ చేయు వ్యక్తి హృదయములోని ఒక కోణములో దొంగ దాగి యున్నాడని మేమతని గురించి నమ్మకముగా చెప్పగలము. ఈ విషయమును దాచిపెట్టుటకు అతను తన హృదయ చీకటిని అహ్మదియ్య జమాఅత్ యదపై వెదజల్లి సంతృప్తి పడుచున్నాడు. వాస్తవానికి జామిఅ మస్జిద్ ఢిల్లీలో అహ్మదియ్య జమాఅత్ స్థాపకులు హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం తమ విశ్వాసములను వ్యక్తపరచుచు స్పష్టమైన పదములలో ఇట్లనిరి.

“నేను విస్తారముగా ఈ క్రింది విషయములను ముస్లిముల ముందు ఈ దైవ గృహములో స్పష్టముగా తెలుపుచున్నాను. గౌ॥ ఖాతముల్ అన్బియా సల్లల్లాహు అలైహి వసల్లం ఖత్మె నబువ్వత్‌ను నేను విశ్వసిస్తాను. ఖత్మె నబువ్వత్‌ను విశ్వసించని వ్యక్తిని అధర్ముడని, ఇస్లాం నుండి బహిష్కృతుడని భావించెదను.”

(తక్రీర్ వాజిబుల్ ఈలాన్, తబ్లీఘె రిసాలత్ సంపుటి 2 పుట 44)

ఖత్మె నబువ్వత్‌ను నమ్మరను ఈ భయానక ఆరోపణను ఖండించుచు వారిట్లనిరి.

“మేము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతమున్నబియ్యీన్ అని విశ్వసించమని నాపై, నా జమాఅత్‌పై మోపుచున్న ఆరోపణ ఒక పెద్ద నింద. మేము ఎంత శక్తి, నమ్మకము, జ్ఞానము, అనుభవముతో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతముల్ అన్బియా అని నమ్ముతామో, విశ్వసిస్తామో దాని లక్షల వంతు కూడ ఇతరులు నమ్మరు. వారి స్థాయి ఇది కానే కాదు. ఖాతముల్ అన్బియాలో నున్న వాస్తవము, గోప్యతను అర్థము చేసుకొనే చేసుకోరు. వారు తాత ముత్తాతల నుండి కేవలం ఒక పదమును వినియున్నారు. కాని దాని వాస్తవికత వారికి తెలియదు, ఖత్మె నబువ్వత్ ఏమిటో, దానిని విశ్వసించే భావమేమిటో తెలియదు. కాని మేము పూర్తి అనుభవముతో (దానిని అల్లాహ్ తాలా బాగుగా ఎరుగును) ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతముల్ అన్బియా అని నమ్ముతాము. అల్లాహ్ తాలా ఖత్మె నబువ్వత్ వాస్తవికతను మాకు ఏ విధముగా తెలిపెననగా మాకు త్రాగించిన విజ్ఞాన పానీయముతో మేమొక ప్రత్యేక ఆనందము పొందుతాము. ఈ చెలిమ నుండి త్రాగిన వారు తప్ప దానిని ఎవరు అంచనా వేయలేరు.” *(మల్ఫూజాత్ సంపుటి 1 పుట 241, 242)*

ఇంతే కాక వారు ప్రమాణపూర్వకముగా ఈ ప్రకటన చేసిరి.

“నేను అల్లాహ్ గౌరవ, వైభవ సాక్ష్యముగా చెప్పుచున్నాను. నేను విశ్వాసిని, ముస్లిమును. నేను అల్లాహ్ తాలా, అతని పుస్తకములు, అతని ప్రవక్తలు, అతని దేవదూతలను, మరణము తరువాతి జీవితమును విశ్వసిస్తాను. మన ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం సర్వ ప్రవక్తలలో ఉత్తములు, ఖాతమున్నబియ్యీన్ అని నా విశ్వాసము.”

*(అరబ్బి పంక్తి అనువాదము: హమామతుల్ బుష్రా పుట 8)*

| **అహ్‌దీస్ బోధనలు** | **“ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను.” అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Mahboobnagar, (Telangana)***

అహ్మదియ్య జమాఅత్ స్థాపకుల పదములలో అహ్మదియ్య జమాఅత్ ప్రతి సభ్యుడు బహిరంగముగా ఇట్లు డప్పు సాటింపు చేయుచున్నాడు, చేయుచు పోవును.

ہم تو رکھتے ہیں مسلمانوں کا دیں    دِل سے ہیں خُدّامِ ختم المرسلیں

మేము ముస్లిముల ధర్మమును పాటిస్తాము. మనస్ఫూర్తిగా మేము ఖత్ముల్ ముర్సలీc సేవకులము

شرک اور بدعت سے ہم بےزار ہیں    خاکِ راہِ احمد مختارؐ ہیں!

అన్యారాధన, దురాచారమును మేము ద్వేషిస్తాము. మేము సర్వాధికారి అహ్మద్ (సల్లం) మార్గ ధూలిమి

تم ہمیں دیتے ہو کافر کا خطاب    کیوں نہیں لوگو تمہیں خوفِ عقاب

(ఓ వ్యితిరేకులారా!) మాకు మీరు అవిశ్వాస బిరుదునిస్తారు. మీకు శిక్ష గురించి ఎందుకు భయము లేదు.

కాని విచిత్రము, విపరీత దౌర్జన్యమేమనగా ఇంత స్పష్టమైన, గట్టి ప్రకటనలు, అంగీకారము, ప్రమాణ పూర్వక వ్యాఖ్యానమును లెక్క చేయకుండా గత వంద సం॥ల నుండి వ్యతిరేక విద్యావంతులు అహ్మదియ్య జమాఅత్‌పై "ఖత్మె నబువ్వత్ తిరస్కరణ" బాణములతో విరుచుకుపడుచున్నారు. "తహఫ్ఫుజె ఖత్మె నబువ్వత్" పేరున రాజకీయ నాయకులు, వారు కొనుగోలు చేసిన ముల్లాలు సామాన్య స్వభావము గల ముస్లిముల మనోభావాలను రెచ్చగొట్టడమే కాక ఇస్లామీయ అభిప్రాయములను, సూత్రములను, స్వయముగా తమ విశ్వాసములను అతి నీచము, హీనంగా అవహేళనకు గురి చేసిరి. ఎందుకగా స్వార్థపరులైన ఈ ముల్లాలు ఒక వైపు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖత్మె నబువ్వత్‌ను ఏ విధముగా నమ్ముతారనగా వారి తరువాత ప్రళయ దినము వరకు ఎటువంటి ప్రవక్త అవతరించడు. ఒక్క శ్వాసలోనే రెండవ వైపు ఒక దొంగ తలుపు తెరిచి ఖత్మె నబువ్వత్ కోటకు రంధ్రము చేసి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కంటే 6 వందల సం॥ క్రితం హజ్రత్ మూసా అలైహిస్సలాం శాసనము తౌరాత్ సేవకు స్వతంత్ర, నేరుగా అల్లాహ్ తాలాతో ప్రవక్తృతవము పొంది, అవతరించిన హజ్రత్ ఈసా అలైహిస్సలాం ముహమ్మదీయ సమాజ సంస్కరణ కొరకు వచ్చెదరని అందురు. వారు ప్రవక్తగా వత్తురు. వారు రెండవ సారి ముహమ్మదీయ సమాజములో ప్రవక్తగా అవతరించినను ఖత్మె నబువ్వత్‌లో ఎలాంటి అభ్యంతరము ఏర్పడదని అందురు. ఇది వ్రతం చెడరాదు–సత్యం మానరాదు అన్నట్లున్నది.

ఈ రెండు విశ్వాసములలో స్పష్టమైన తేడా యుండడమే కాక దీనితో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అవమానముతో పాటు వారి స్థాయిలో భేదము ఏర్పడును. నవూజుబిల్లాహ్ హుజూరె అక్రమ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రపంచములో శాశ్వతముగా దైవ అనుగ్రహ చెలిమలను మూసివేసిరి. వారి సమాజము ఉత్తమ సమాజమైనను ఇతర జాతికి చెందిన ఒక ప్రవక్త అవసరము వచ్చెను. వాస్తవానికి పవిత్ర ఖుర్ఆన్ హజ్రత్ ఈసా అలైహిస్సలాంను "وَرَسُوْلًا اِلٰى بَنِيْٓ اِسْرَآءِيْلَ" (ఆలె ఇమ్రాన్:50) అని పేర్కొనెను. వారు ఇస్రాయీల్ సంతతికి మాత్రమే ప్రవక్త. వారు ముహమ్మదీయ సమాజము కొరకు ప్రవక్త కానే కాదు. ప్రత్యేకంగా పవిత్ర ఖుర్ఆన్ ఒకటి రెండు కాదు 30 సూక్తులతో హజ్రత్ ఈసా అలైహిస్సలాం మరణము నిరూపితమైనది. నిజమైన రీతిలో ప్రవక్త ప్రేమికులను ప్రవక్త అవమానితులుగా అపనిందకు గురిచేసే నీచ ప్రయత్నము బదులు మొదట తమ ఆత్మపరిశీలన చేసుకొని ప్రవక్త అవమానితులు మీరా మేమా? తెలుసుకోవాలని మేము ఈ విగ్రహపూరిత ముల్లాలకు చెప్పదలచితిమి. మీరు కేవలం హజ్రత్ ఈసా అలైహిస్సలాంను బ్రతికించి చూపగలరు! వారు జీవించడంతో జమాఅత్ మొత్తం స్వయముగా మరణించును. వంద సం॥ల ఈ వివాదము ఒక్క సారిగా అంతమగును. !!

దీనికి ఎదురుగా అహ్మదియ్య జమాఅత్ విశ్వాసమేమనగా నిస్సందేహముగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం శుభవార్త ప్రకారము ముహమ్మదీయ సమాజములో మసీహ్ నిశ్చయముగా అవతరింతురు. ఆ అవతరించే మసీహ్ ప్రవక్త అగును. దీనిని మీరు కూడ అంగీకరింతురు. కాని ఆ మసీహ్ ఇస్రాయీల్ సంతతికి చెందినవారు కాక ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాజ వ్యక్తి, వారి బానిస అగును. అనుగ్రహము, సత్కారములో ఈసా అలైహిస్సలాంను పోలియుందురు. హజ్రత్ షేఖ్ ముహియుద్దీన్ ఇబ్నె అరబీ రహ్మతుల్లాహు అలైహి కూడ మా అభిప్రాయమును బలపరచుచు ఇట్లనిరి.

وَجَبَ نُزُوْلُهٗ فِيْ اٰخِرِ الزَّمَانِ بِتَعَلُّقِهٖ بِبَدَنٍ اٰخَرَ.

*(తఫ్సీర్ అరాఇసుల్ బయాన్ సంపుటి 1 పుట 262)* అనగా హజ్రత్ ఈసా అలైహిస్సలాం అంతిమ కాలములో మరొక శరీరము (వ్యక్తిత్వము)తో అవతరించుట అనివార్యము. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత అవతరించే దైవ ప్రవక్త అయిన మసీహ్ మౌవూద్ వారి సమాజములో, వారితోనే లబ్ధి పొంది రావచ్చును. బయటి నుండి రానే రాలేడు. ఇందులో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపూర్ణ ప్రవక్తృత్వ అవమానము కాక వారి సంపూర్ణ ప్రవక్తృత్వ విశిష్టత, వారి పవిత్ర శక్తి లబ్ధి నిరూపితమగును. దీనితో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వ ముద్ర తొలగిపోదు, వారు అంతిమ ప్రవక్త అనుటలో కూడ తేడా రాదు. ఎందుకనగా ఈ స్థితిలో అసలు, శాశ్వత, శాసన ప్రయోజకుని విధంగా వారే అంతిమ యుందురు. లేనిచో హజ్రత్ ఈసా అలైహిస్సలాం మరల ప్రపంచములో వచ్చినచో ఖత్మె నబువ్వత్ ముద్ర తొలగిపోవును. తద్వారా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అవమానము జరుగును.

అహ్మదియ్య జమాఅత్ స్థాపకులు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఈ ముఖ్య విషయమునే ప్రస్తావించుచు ఇట్లనిరి. "ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంపైనే ప్రవక్తృత్వ విశిష్టతలన్ని ముగిసినవని నేను ఎంతో నమ్మకము, దావాతో చెప్పుచున్నాను. వారికి వ్యతిరేకంగా ఒక సంస్థను స్థాపించు వ్యక్తి అసత్యుడు, మోసకారి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత మరొకరిని ప్రవక్తగా విశ్వసించుచు వారి ఖత్మె నబువ్వత్‌ను ముక్కలు చేయు వ్యక్తి శాపితుడని నేను స్పష్టముగా తెలుపుచున్నాను. అందుకే అదే ముహమ్మదీయ ప్రవక్తృత్వ ముద్ర లేని వ్యక్తి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత ప్రవక్తగా వచ్చే ఆస్కారం లేదు. మా వ్యతిరేక ముస్లిములు పొరపాటు పడి ఖత్మె నబువ్వత్‌ను విడిచి ఇస్రాయీలీ ప్రవక్తను ఆకాశము నుండి దింపుచున్నారు. నేను తెలుపునదేమనగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర శక్తి, వారి శాశ్వత ప్రవక్తృత్వ చిన్నపాటి మహిమ ఏమనగా 13 వందల సం॥ల తరువాత కూడ వారి శిక్షణ, బోధనతో మసీహ్ మౌవూద్ వారి సమాజములో అదే ప్రవక్తృత్వ ముద్రను తీసుకొని వచ్చును. ఇది అవిశ్వాసమైనచో నేను ఈ అవిశ్వాసమును ఆశింతును. కాని వీరి తెలివి చీకటి పాలయ్యెను. ప్రవక్తృత్వ కాంతిలోని ఏ భాగము వీరికి లభించలేదు. కనుక దీనిని అర్థము చేసుకోలేరు. దీనిని అవిశ్వాసమని నిర్ణయించుచున్నారు. వాస్తవానికి దీనితో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విశిష్టత, వారి జీవిత సాక్ష్యము లభించును."

*(అల్‌హకమ్: 10 జూన్ 1905 : పుట 2)*

కాని విచిత్ర విషయమేమనగా నేడు కేవలము అహ్మదియ్య జమాఅత్ వ్యతిరేకతలో అంధులై కోపము, ఈర్ష్య, అసూయ భావములకు లోనై సులభంగా ఖ్యాతిని పొందుటకు, సామాన్య ముస్లిములను రెచ్చగొట్టుటకు అహ్మదియేతర ఉలమాలందరు పవిత్ర ఖుర్ఆన్ వాస్తవములను ప్రక్కకు పెట్టి ఎంతో అబద్ధము, అసత్యము పలుకుచు "ఖాతమున్నబియ్యీన్" అనగా అన్ని రకాల ప్రవక్తృత్వము శాశ్వతముగా అంతమైనదని, ఇదే ముహమ్మదీయ సమాజ ఏకగ్రీవ విశ్వాసమని అంటున్నారు. వాస్తవానికి ఒక్క వ్యక్తి కూడ విభేదించనప్పుడే ఏకగ్రీవ విశ్వాసమనబడును. ఈ విశ్వాసములో ఒక్కరిద్దరే కాదు గొప్ప పండితులు తమ విభేదమును తెలిపిరి. వారి అభిప్రాయములను నేను తరువాత ప్రస్తావింతును. ప్రస్తుతము ఖత్మె నబువ్వత్ గురించి నేను కొన్ని విషయములను తెలిపెదను.

శ్రో॥ మన సాధారణ ముస్లిం సోదరులు వారి ఉలమాలు ఖత్మె నబువ్వత్ గురించి తమ విశ్వాస సాక్ష్యముగా కేవలము ఒక్క సూక్తిని

**వర్తమాన ఖలీఫా వాఖ్యములు**

**"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్లె ఆందోళన కూడ దూరం కాదు. "**

**(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)**

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*



وَلٰكِنۡ رَّسُوۡلَ اللّٰهِ وَخَاتَمَ النَّبِيّٖنَ మాత్రమే ప్రవేశపెట్టెదరు. ఈ సూక్తియే విచారార్హణ గలది. పవిత్ర ఖుర్ఆన్ పద్ధతి يُفَسِّرُ بَعۡضُهٗ بَعۡضًا ఏమనగా అదొక అంశమును తెలిపినప్పుడు వివిధ చోట్ల దానిని విశదీకరించును, స్పష్టము చేయును. కాని ఈ ముఖ్యమైన అంశములో పవిత్ర ఖుర్ఆన్ وَلٰكِنۡ رَّسُوۡلَ اللّٰهِ وَخَاتَمَ النَّبِيّٖنَ అని మౌనము పాటించెను. మన ముస్లిం సోదరులు దీనితో వెలికితీయదలచిన అంశమును దీనిని బలపరచుటలో ప్రస్తావించక పోవడమే కాక దీనికి వ్యతిరేకంగా అనేక చోట్ల ప్రస్తావించడం, ఆంహత్ర్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్త ృత్వ లబ్దిని ఇతర ప్రవక్త కంటే గొప్ప రీతిలో విస్తృతంగా ప్రవేశ పెట్టుట మన ముస్లిం సోదరులు ఖాతమున్న బియ్యీన్ సూక్తితో తీయదలచిన అర్థము, భావము కాదనుటకు గట్టి నిదర్శనము.

అరబ్బి నిఘంటువు ప్రకారము 'ఖతమ్' నకు మూడు అర్థములు తెలుపబడెను. ఇమామ్ ఇస్ఫహాని రాఘిబ్ రహ్మతుల్లాహ్ అలైహి తమ పుస్తకము "ముఫ్తదాతె రాఘిబ్' లో 'ఖతమ్' అను పదమును ప్రస్తావించిరి.

(1) 'ఖతమ్'నకు మొదటి అసలు అర్థము "తాసీరుష్షైయి" ఇతర వస్తువులపై తమ ప్రభావము వేయుట. ఉదా॥ ముద్ర తన చిత్రము, ప్రభావమును ఇతర వస్తువులపై వేయును.

(2) 'ఖతమ్' నకు రెండవ అర్థము నిలుపుదల, నివారించుట కూడ. కాని ఇది అసలు అర్థము కాక భావార్థము. ఉదా॥ خَتَمَ اللّٰهُ عَلٰى قُلُوۡبِهِمۡ وَعَلٰى سَمۡعِهِمۡ అల్లాహ్ వారి హృదయములపై ముద్ర వేసెను. అనగా సత్యమును స్వీకరించకుండా వారి హృదయముపై ముద్ర వేసెను. కాని ప్రతి విషయము కొరకు వారి హృదయములు మూసుకపోలేదు.

(3) 'ఖతమ్' నకు మూడవ అర్థము చివరి వరకు చేరుట కూడ. కాని ఇది కూడ అసలు అర్థము కాక భావార్థమే. ఉదా॥ ఇట్లందురు. నేను పవిత్ర ఖుర్ఆన్ ను ముగించినాను. దీని అర్థము ఖుర్ఆన్‌ను మూసి వేయుట లేదా ఆటంకము సృష్టించుట కాదు. తిలావత్ చేయుచు దాని చివరి వరకు చేరినామని దీని అర్థము.

'ఖతమ్'నకు నిజమైన నిఘంటువు అర్థము ఇతర వస్తువులో తమ చిత్రములను పుట్టించుట అని దీనితో స్పష్టమగుచున్నది. ఇదే అసలైన అర్థము. ఇతరత్రా అన్ని భావార్థములే. భాషా పండితుల ఆమోదిత సూత్రాను సారము ఒక పదమునకు అసలు అర్థము చేయుటలో ఆటంకముగా ఏర్పడే సూచన దాని వెనుక ముందు వుండనంత వరకు భావార్థము తీసుకోరాదు. ఉదా॥ పులి అను పదమునకు తన అసలు అర్థము ప్రకారము అడవిలో యుండే క్రూర జంతువును తలపించును. కాని మనము ఒక మానవున్ని ఇతడు పులి అన్ని అన్నచో ఇక్కడ మానవుడు అను సూచన పులి అనగా క్రూర జంతువు కాక ధైర్యవంతుడైన మానవుడని తెలుపును. ఇదే విధముగా ఖాతమున్నబియ్యీన్‌లో ఖాతమ్ అను పద నిజమైన అర్థము ఇతరులలో తమ ప్రభావములను వేయు ప్రవక్తల ముద్ర. ఇది వరమును ప్రసాదించుటను సూచించును. వరమును అంతము చేయుట కాదు. ఖాతమున్నబియ్యీన్ సూక్తిలో దాని అసలు అర్థము తీసుకొనుటలో ఆటంకము ఏర్పడు ఎటువంటి సూచన లేనందున ఆమోదిత సూత్రముల మేరకు ఇక్కడ భావార్థము తీసుకొనుట సమంజసము కాదు. భావార్థము తీసుకోదలచినచో ఆ అర్థములను పరిమిత, నిర్ణయించి మాత్రమే తీసుకోవచ్చును. ఖాతమున్నబియ్యీన్ అసలైన అర్థమును దృష్టిలో యుంచుకొని అహ్మదియ్య జమాఅత్ స్థాపకులు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"వైభవోపేతుడైన అల్లాహ్ తాలా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతమ్ గల వారిగా చేసెను. అనగా విశిష్టతలు ప్రసాదించే ముద్ర అందించెను. ఇది మరో ప్రవక్తకు నొసంగబడలేదు. అందుకే వారి పేరు ఖాతమున్నబియ్యీన్ అయినది. వారి ఆధ్యాత్మిక దృష్టి ప్రవక్తను సిద్ధము చేయును. ఈ పవిత్ర శక్తి మరెవ్వరికి లభించలేదు." *(హాషియా హఖీఖతుల్ వహీ : పుట 97)*

సల్లల్లాహు అలైహి వసల్లం ఖాతమున్నబియ్యీన్ అయినందున ఆ వరములన్నియు అంతమైనవను ఆలోచన మీ మనసులలో రాకూడదు. ఈ దుఆలో కేవలము మార్గదర్శనమును కోరుట మాత్రమే ఉద్దేశము కాదను విషయము ఇక్కడ గుర్తుంచుకోవలసిన అవసరమున్నది. ఇంతే ఉద్దేశితమైయున్నచో اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ అంటే సరిపోయేంది. దీనికి తోడు صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ పదములను పెంచవలసిన అసవరము లేకుండెను. ఈ పదములను పెంచడంతో ఖత్మె నబువ్వత్ తప్పుడు అభిప్రాయమును ఖండించుచు గతములో ప్రజలు పొందిన వరుములను పొందుటకు ఈ దుఆ నేర్పించబడెనని స్పష్టమగుచున్నది. గత పక్షములు పొందిన బహామానములను అల్లాహ్ తాలా మరో చోట ఇట్లు వివరించెను.

(అల్ మాయిదహ్: 21) అనగా మూసా అలైహిస్సలాం తన జాతితో ఇట్లనిరి. 'ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్ మీకు చేసిన ఉపకారమును గుర్తు చేసుకొనుము. మీలోనే అతడు సందేశహరులను నియమించెను. మిమ్ములను రాజులుగా చేసెను." ఇప్పుడు ఫాతిహా అధ్యాయపు దుఆను ఈ పవిత్ర సూక్తిని సంయుక్తముగా చూచినచో ముస్లిములకు కూడ ప్రవక్తృత్వము, రాజరికము రెండు రకముల బహుమానములు లభించునని స్పష్టమగును. ఎందుకనగా అది ఉత్తమ సమాజము, సర్వోత్తమ ప్రవక్తను విశ్వసించేవారు. మరో చోట అల్లాహ్ తఆలా ఇట్లనెను.

(అన్నిసా: 70) "అల్లాహ్‌కు ఈ ప్రవక్తకు ఎవరు విధేయులో వారు అల్లాహ్ వరమును పొందిన వారితో నుందురు. అనగా ప్రవక్తలు, సత్యమూర్తులు, ఆత్మార్పణము చేసికొన్నవారు, ధర్మమూర్తులు, వీరు పరమ స్నేహితులు."

ఈ పవిత్ర సూక్తితో ఫాతిహా అధ్యాయములో ప్రస్తావించబడిన బహుమానము గురించి మరింత వివరణ తెలియును. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుకరణతో ఒక నిజమైన ముస్లిం సత్యవంతుని స్థాయి నుండి ప్రగతి చెంది ప్రవక్త ృత్వ స్థాయి వరకు చేరవచ్చును. జమాఅతేతర ఉలమాలు ఈ సూక్తి అనువాదము చేసినట్లు అల్లాహ్ తఆలా, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం విధేయులు కేవలం బాహ్య రూపంలో ప్రవక్తల వెంట యుందురని కాని ప్రవక్త కారని అర్థము చేసినచో ఇదే వివరణ ఇతర మూడు స్థాయిలకు కూడ వర్తించును. అనగా వారు సత్యమూర్తుల వెంట యుందురు కాని సత్యమూర్తులు కాలేరు. అమరుల వెంట యుందురు కాని అమరులు కాలేరు. వారు ధర్మమూర్తుల వెంట యుందురు కాని ధర్మమూర్తుల స్థాయిని పొందలేరు. ఈ వివరణ నిరర్థకవేం కాక అసమంజసమైనదనుట విధితమే. ఎందుకనగా ఈ అర్థము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప స్థాయికి విరుద్ధమైనది. నవూజుబిల్లాహ్! వారి అనుకరణతో ఒక వ్యక్తి సత్యమూర్తుల, ధర్మమూర్తుల స్థాయికి చేరలేడు. ముహమ్మదీయ సమాజములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుకరణతో ప్రవకత్తృత్వ ద్వారమును ఈ సూక్తి స్పష్టముగా తెరుచుచున్నది. మన సాధారణ ముస్లిం సోదరులు ప్రవేశపెడుచున్న ఖత్మె నబువ్వత్ భావమును ఖండించుచున్నది.

గౌ॥ శ్రో॥ ఖాతమున్నబియ్యీన్ సూక్తి భావమును అందరికంటే ఎక్కువ సయ్యద్నా హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం అర్థము చేసుకునేవారు. కనుక ఈ విభేదమునకు పరిష్కారమును మనము పవిత్ర ఖుర్ఆన్ తరువాత ప్రవక్త దర్బారులో అన్వేషించెదము. ఖాతమున్నబియ్యీన్ సూక్తి హిజ్రి 5వ సం॥లో అవతరించినదని చరిత్ర ద్వారా నిరూపితమగుచున్నది. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సుపుత్రుడు హజ్రత్ ఇబ్రాహీమ్ హిజ్రి 9వ సం॥లో మృతి చెందిరి. వారి మరణము సందర్భమున హుజూర్ (స) ఇట్లనిరి. لَوۡ عَاشَ لَكَانَ صِدِّيۡقًا نَبِيًّا *(ఇబ్నె మాజా సంపుటి 1 కితాబుల్ జనాఇజ్ పుట 237)*

అనగా ఇబ్రాహీమ్ (రజి) జీవించి యుంటే తప్పక సత్యమైన సందేశహరుడు అయ్యేవారు. ఖాతమున్నబియ్యీన్ సూక్తి అవతరించి 4 సం॥ అయిన తరువాత హుజూర్ అక్రమ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ పదములను పలికిరి. అయినను ఇబ్రాహీమ్ (రజి) జీవించి యుంటే తప్పక సత్యమైన సందేశహరుడు అయ్యేవారని వారనిరి. మన వ్యతిరేక ఉలమాలు చెప్పిన విధముగానే ఖత్మె నబువ్వత్ భావము యుండినచో ఇబ్రాహీమ్ (రజి) జీవించి యున్నను సందేశహరుడు కాకుండునని అనేవారు. ఎందుకనగా ఇందుకు ఖాతమున్నబియ్యీన్ సూక్తి అవరోధముగా మారును. కాని హుజూర్ (స) అలా అనలేదు. ఇబ్రాహీమ్ (రజి) జీవించి యుంటే తప్పక సత్యమైన సందేశహరుడు అయ్యేవారని అన్నారు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖాతమున్నబియ్యీన్ అయినను ముహమ్మదీయ సమాజములో ప్రవక్తృత్వ ద్వారము తెరిచియున్నదని తెలుపుటకు ఇది స్పష్టమైన, గట్టి సాక్ష్యము. వారినే మనము సమాజపు ప్రవక్త అని అందురు.

ఫిఖ హన్ఫియా ప్రముఖ ఇమామ్ ముల్లా అలీ ఖారి(హి॥1014. క్రీ॥శ॥1606)ఈ హదీసును వివరించుచు ఇట్లనిరి.

(మౌజూఆత్ కబీర్: 58-59) అనగా ఇబ్రాహీమ్ (రజి) జీవించి యుండినచో ప్రవక్త అయ్యేవారు. ఇదే విధముగా ఉమర్ (రజి) ప్రవక్త అయ్యేవారు. వీరిద్దరు వారి అనుకరణలోనే యుండేవారు. కనుక ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ వ్యాఖ్యానము (ఇబ్రాహీమ్ జీవించియుండినచో ప్రవక్త అయ్యేవారు) ఖాతమున్నబియ్యీన్ సూక్తికి విరుద్ధము కాదు. ఎందుకనగా ఈ సూక్తి భావమేమనగా వారి సమాజమును రద్దు చేయు ప్రవక్త రాలేదు, వారి సమాజమునకు చెందని ప్రవక్త కూడ రాలేదు.

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2023-2025, Vol. 10. Thursday, 04 DEC 2025, Issue No - 49

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

ఇదే విశ్వాసమును తెలుపుచు అహ్మదియ్య జమాఅత్ స్థాపకులు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. "ఒక సమాజపు వ్యక్తి కేవలము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుకరణ వలన దైవవాణి, సువార్తవాణి ప్రవక్తృత్వ స్థాయి పొందినచో, సందేశహరుని పేరుతో సత్కరించబడినచో దీని వలన ప్రవక్తృత్వ ముద్ర తొలగిపోదు. ఎందుకనగా అతను సమాజపు వ్యక్తి, అతని స్వంత ఉనికి ఏమియును లేదు. అతని విశిష్టత అతను అనుసరించిన ప్రవక్త విశిష్టత. అతడు ప్రవక్త మాత్రమే అనబడడు, ప్రవక్త, సమాజపు వ్యక్తి అని అనబడును. కాని సమాజపు వ్యక్తి కాని ప్రవక్త వచ్చినచో ఖత్మె నబువ్వత్‌నకు విరుద్ధము ఏర్పడును."
*(చశ్మ మసీహీ: 69 హాషియా)*

శ్రీ॥ హజ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్‌హా విద్యా స్థాయి చాలా గొప్పదని ముస్లిములందరి ఏకగ్రీవ నమ్మకము. వారు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర సతీమణి. పవిత్ర ఖుర్‌ఆన్ భావములను అర్థము చేసుకొనుటలో ప్రత్యేక నైపుణ్యము కలిగియుండిరి. పెద్ద పెద్ద అనుచరులు వారితో సందేహాలు అడిగేవారు. వారిట్లనిరి. قُوْلُوْا اِنَّهٗ خَاتَمُ الْاَنْبِيَآءِ وَلَا تَقُوْلُوْا لَا نَبِيَّ بَعْدَهٗ *(దుర్రె మన్సూర్ : సంపుటి 5 పుట 204)* అనగా ఓ ప్రజలారా! ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖాతముల్ అన్బియా అని అనగలరు. కాని వారి తరువాత ఎటువంటి ప్రవక్త రాడని అనకుము. ఇప్పుడు చెప్పండి! తమ తప్పుడు అభిప్రాయముపై మొండిగా వ్యవహరించుచున్న నేటి ముల్లాల పవిత్ర ఖుర్‌ఆన్ పట్ల వివేకము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ ఆయిషా (రజి) కంటే ఎక్కువా ?

హజ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్‌హా గారి ఈ వాఖ్యమును వివిధ గొప్ప విద్యావంతులు బలపరచినారు. దీనికిట్లు భావము తెలిపిరి. ఇక ముందు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాజమును రద్దు చేయు, వారి సమాజమునకు చెందని ఎటువంటి ప్రవక్త రాలేడు. కనుక సమయ భావం వలన ఆ గొప్ప విద్యావంతుల పేర్లను మాత్రమే వెల్లడించగలను.

**(1)** షేఖుల్ ఇమామ్ హజ్రత్ ఇబ్నె ఖయ్యిమ్, (మరణము 267 హిజ్రి) **(2)** ఆసియాలోని భారత, పాకిస్తాన్ ప్రముఖ ముహద్దిస్, విద్యావంతులు హజ్రత్ ఇమామ్ ముహమ్మద్ తాహిర్: (మరణము హిజ్రి 986, క్రీ॥.శ॥1578) **(3)** ఖుతుబుల్ అఖ్తాబ్ ఇమామ్ రబ్బాని ముజద్దిద్ అల్ఫె సాని హజ్రత్ షేఖ్ అహ్మద్ ఫారూకీ సర్‌హిందీ. (మరణము:హిజ్రి 1034, క్రీ॥శ॥1624) **(4)** ఇస్లాం ప్రపంచములో ప్రముఖ, గొప్ప సూఫీ, ప్రఖ్యాత రచయిత, ప్రముఖ ముతకల్లిమ్ హజ్రత్ ఇమామ్ అబ్దుల్ వహాబ్ షీరాని. (మరణము: హిజ్రి 976, క్రీ॥శ॥1568) **(5)** ఆరవ శతాబ్దపు ప్రముఖ హిస్పానీ విశ్లేషకులు షేఖ్ అక్బర్ హజ్రత్ ముహియుద్దీన్ ఇబ్నె అరబి (రహ్మ): (మరణము: హిజ్రి 638, క్రీ॥శ॥ 1240) **(6)** 12వ శతాబ్దపు ముజద్దిద్, భారత దేశములో పవిత్ర ఖుర్‌ఆన్ ప్రథమ పారసీక అనువాదకులు హజ్రత్ సయ్యద్ వలియుల్లాహ్ షాహ్ ముహద్దిస్ ఢిల్లీ (మరణము: హిజ్రి 1171, క్రీ॥శ॥1762) **(7)** అహ్లె సున్నత్ ప్రముఖ విద్యావంతులు హజ్రత్ మౌలానా అబుల్ హసనాత్ అబ్దుల్ హై లఖ్నవీ ఫిరంగీ ముహల్ల : (మరణము: హిజ్రి 1304, క్రీ॥శ॥ 1886) **(8)** మౌలానా ముహమ్మద్ ఖాసిమ్ నానూత్వీ గారు: (మరణము: క్రీ॥శ॥ 1880) **(9)** దారుల్ ఉలూమ్ దేవుబంద్ మాజీ నిర్వహకులు ఖారీ ముహమ్మద్ తయ్యిబ్ గారు. ఖత్మె నబువ్వత్ భావము అహ్మదియ్య జమాఅత్ చేయుచున్న విధముగానే అనేకులైన వీరందరు చేసిరి. ఖత్మె నబువ్వత్‌ను సమాజ ఏకగ్రీవ విశ్వాసమని చెప్పుకునే వారు ఎంతటి తప్పిదమైన భావములో యున్నారో గ్రహించగలరు. అహ్మదియ్య జమాఅత్ స్థాపకులు ఇట్లు తెలిపిరి.

"నూతన శాసన ఆదేశములతో కూడిన ప్రవక్తృత్వము మాత్రమే అంతమైనది లేదా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుకరణను వీడి ప్రకటించబడని దావా. కాని ఒక వ్యక్తిని దైవవాణిలో అల్లాహ్ తఆలా సమాజపు వ్యక్తిగా అభివర్ణించగా రెండవ వైపు అతని పేరు సందేశహరుడని నిర్ణయించినచో ఈ దావా పవిత్ర ఖుర్‌ఆన్‌నకు విరుద్ధము కాదు. ఎందుకనగా ఈ ప్రవక్తృత్వము సమాజపు వ్యక్తి అయినందున ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వమునకు ఛాయగా యుండును. పూర్తి స్థాయి స్వతంత్ర ప్రవక్తృత్వము కాదు."
*(జమీమ బరాహీనె అహ్మదియ్య 5వ భాగము పుట 177-178)*

తమ ప్రవక్తృత్వ బిరుదు గురించి వారిట్లనిరి.

"ఈ సత్కారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుకరణతో నాకు లభించినది. నేను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాజ వ్యక్తిని కానిచో, వారిని అనుకరించనిచో ప్రపంచములోని పర్వతములకు సమానంగా నా కర్మలు యుండినను ఈ దైవవాణి సత్కారము పొందేవాడిని కాదు. ఎందుకనగా ఇప్పుడు ముహమ్మదీయ ప్రవక్తృత్వము తప్ప మిగతా ప్రవక్తృత్వములన్నియు అంతమైనవి. శాసనముతో కూడిన ఏ సందేశహరుడు రాలేడు. కాని ముందుగానే సమాజపు వ్యక్తి అయిన శాసనరహిత సందేశహరుడు రావచ్చును. ఇదే తరహాలో నేను సమాజపు వ్యక్తిని, ప్రవక్తను కూడ." *(తజల్లియాతె ఇలాహియ్య : పుట 24)*

సారాంశమేమనగా ఖత్మె నబువ్వత్ అర్థము వరమును అంతము చేయుట కానే కాదు. ఇలా భావించినచో వారు ప్రపంచ దయాసాగరులైనను ఆధ్యాత్మిక సర్వ స్థాయిలను మూసివేసిన వారగుదురు. తద్వారా ఇలా వారి అవమానము ఏర్పడును. ఏ విధముగాను ఇది సమంజసము కాదు. ఇక ముందు అన్ని రకాల ఆధ్యాత్మిక వరములు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుకరణ, విధేయతతోనే లభించుననుట నిజమైన విషయము.

ఖత్మె నబువ్వత్ రక్షణ అను పునాది రహిత దావాదారులు తమ ఆత్మ పరిశీలన చేసుకొన్నచో వారే అందరి కంటే పెద్ద ఖత్మె నబువ్వత్ తిరస్కృతులని తేలిపోవును. ఎందుకనగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత ముహమ్మదీయ సమాజము సంస్కరణ కొరకు అల్లాహ్ తఆలా ప్రవక్త అయిన హజ్రత్ ఈసా అలైహిస్సలాం అవతరింతురని వారు విశ్వసించుచున్నారు. ఒక వైపు అన్ని రకాల ప్రవక్తృత్వము ముగిసినదని వాదించుచున్న వ్యక్తి రెండవ వైపు ఒక్క శ్వాసలోనే అల్లాహ్ ప్రవక్త ఈసా అవతరింతురని అంటున్నందున ఖత్మె నబువ్వత అక్కడికి పోయినది ? لَا نَبِيَّ بَعْدَهٗ ఏమైనది. సామాన్య ముస్లిములను చేయుచున్న స్పష్టమైన మోసమిది.!!

నేడు భూమండలంపై ఖత్మె నబువ్వత్ గొప్ప స్థాయి రక్షణలో హృదయపూర్వక సేవలు కేవలం అహ్మదియ్య జమాఅత్ మాత్రమే అందించుచున్నది. ప్రపంచ అవిశ్వాస, శిలువ మైదానములలో పవిత్ర కలిమ لَآ اِلٰهَ اِلَّا اللّٰهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰهِ దైవ ఏకత్వ పిలుపును మారుమ్రోగించుచు ఇస్లాం నిజైమన, కాంతి వంతమైన, అందమైన ముఖమును ప్రపంచము ముందు ప్రదర్శించుచ్నుది. ఫలితముగా ఇస్లాం, ఇస్లాం స్థాపకులను దూషించేవారు నేడు ఖాతమున్నబియ్యీన్ హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం బానిసత్వములో గర్వ పడుచు రేయింబవళ్లు వారిపై దురూద్ పంపురైనారు.

శ్రీ॥ తహఫ్ఫుజ్ ఖత్మె నబువ్వత్ సంస్థలను ఏర్పాటు చేసుకొని సాధారణ ప్రజలను తప్పుద్రోవ పట్టించుచున్న వారు కాస్త గమనించగలరు. సయ్యద్నా హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాం ఎప్పుడైతే మసీహ్ మౌవూద్, సమాజపు ప్రవక్తగా దావా చేసినారో అప్పటి నుండి అనగా 125 సం॥ల నుండి ఇటువంటి వ్యతిరేక సంస్థలు అన్ని విధాలా కష్టపడినను పరాజయం, విఫలం తప్ప ఏమి సాధించినారు ? రెండవ వైపు అహ్మదియ్య జమాఅత్ గత 125 సం॥ల నుండి 207 దేశములలో ఎంతో ప్రగతి చెందుచు ఇస్లాం శాంతియుత బోధన, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సజీవ ప్రవక్త, పవిత్ర ఖుర్‌ఆన్ సజీవ గ్రంథము, ఇస్లాం దేవుడు సజీవుడను సాక్ష్యమును నిదర్శనముల ద్వారా ప్రపంచములో వ్యాపించుచున్నది. "అందరిని ప్రేమించు – ఎవ్వరిని ద్వేషించకు" అను సూత్రమును పాటించుచు యావత్ జగత్తులో మానవత్వముతో ప్రేమ, సామరస్యము, సత్‌ప్రవర్తనను ప్రోత్సహించుచున్నది.

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz